# చైతన్యం

నవంబరు 2023

సంకల్ప బలం

రు.20/-

సామాజిక విలువల మాసపత్రిక

# ఎవరికి పట్టం?






INDIA
INDIA




వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

# చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

నవంబరు 2023

సంపుటి -13 సంచిక - 2


## ఈ సంచికలో....


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| మహాభారతంలో గాంధారి | 6 |
| వార్తా విశేషాలు | 10 |
| బ్రహ్మ ఖండం | 20 |
| చంద్రమోహన్ | 25 |
| ప్రకృతి | 26 |
| అనుభవపాఠాలు | 27 |
| కార్తీకదీపం- మంగళకరం శుభప్రదం | 32 |
| ఈ విశ్వం యొక్క ఉనికికి కారణం ఏమిటి | 38 |
| దహగాం సాంబమూర్తి | 42 |
| గ్రహాలకే గ్రహణం పడితే | 47 |
| శ్రీమాత్రే నమ: | 48 |
| విష్ణు అనుసంధానమైన శైవక్షేత్రం దామగుండం | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## కార్తీక శోభతో తెలుగు రాష్ట్రాలు

కార్తీకమాసంలో ప్రజలంతా భక్తి శ్రద్ధలతో పుణ్య నదులలో స్నానం చేస్తూ, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కార్తీక శోభతో తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్య క్షేత్రాలు, శివాలయాలు కిటకిటలాడుతున్నాయి. వేకువజాము నుంచే గోదావరి, కృష్ణా, భద్రాచలం, వేములవాడ తదితర ప్రాంతాల్లో భక్తుల రద్దీ నెలకొంది. నదుల్లో స్నానం చేసి అనంతరం దీపాలు వెలిగించి, పూజలు నిర్వహించి, దీపాలు నదుల్లో వదులుతున్నారు. అంతే కాదు ఈ మాసమంతా ఉపవాసాలతో, లక్షపత్రి పూజలతో, అన్నాభిషేకాలతో, అభిషేకాలతో ప్రజలంతా భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. తిరుపతి లో కార్తీక దీపోత్సవం వేడుకలు గోవింద నామ స్మరణతో తితిదే పరిపాలన భవనం మారు మ్రోగిపోయింది. భక్తులు భారీ ఎత్తున హాజరై దీపాలు వెలిగించారు. తిరుపతిలో కార్తీక దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.

## గ్రేటర్ హైదరాబాద్ పైనే అన్ని పార్టీల ప్రత్యేక దృష్టి

శాసన ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంటోంది. ఎన్నికలకు ఎక్కువ సమయం లేకపోవడంతో గ్రేటర్ హైదరాబాద్ పైనే ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఈ నెల 25న కేసీఆర్ భారీ బహిరంగ సభ, 27న ప్రధాని మోదీ రోడ్ షో నిర్వహించనున్నారు, కాంగ్రెస్ సైతం చివరి వారంలో హైదరాబాద్ లో ప్రత్యేక ప్రచారం నిర్వహించాలని ప్రణాళికలు వేస్తోంది. ఆఖరి వారం అగ్ర నేతలంతా రాష్ట్రంలోనే. ఎన్నికల ప్రచారంలో ఆఖరి ఘట్టం రసమయంగా మారనుంది. వారం రోజుల పాటు అగ్రనేతల ప్రచారంతో రాష్ట్రం హోరెత్తనుంది. ప్రధాని సహా జాతీయ నేతలు, రాష్ట్ర కీలక నాయకులు అంతా ప్రచారాన్ని తార స్థాయికి తీసుకెళ్లనున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా భాజపా, కాంగ్రెస్ జాతీయ నేతలు రాష్టంలో ఎన్నికల ప్రచారంపై దృష్టి మళ్లించాయి . ఈ నెల 23 తో ఇతర రాష్ట్రాల్లో ప్రచారం ముగియడంతో , వారు తెలంగాణాకు ప్రాధాన్యత నిస్తున్నారు.

## మానకొండూరులో భారాస ప్రజా ఆశీర్వాద సభ

సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణా వ్యాప్తంగా సీఎం కేసీఆర్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. మాన కొండూరులో ఏర్పాటుచేసిన సభలో ఆయన పాల్గొంటూ నిరుపేదలు చాలా బాధలలో రూ 200 పెన్షన్లతో ఉన్నారు. అసలు పెన్షన్లు ఎందుకు ఇవ్వాలి? అని అడిగాను.

కొందరు కొందరు విధి వంచితులౌతారు. వారికి అండగా నిలబడి, కనీస ఆహారం తీసుకుందుకు కావాలి అని, రూ 1000 నుండి రూ 2000లకు పెంచాను. ఇక్కడ ఈ సారి గెలిస్తే 5000 లకు పెంచుతాను. ఫ్రీగా కళ్ళ డాక్టర్లు చూసి, మీకు కళ్లద్దాలు ఇచ్చాము. ఇవన్నీ ఇందిరమ్మ రాజ్యంలో ఉన్నాయా? ఈ విధంగా అనేక రకాలుగా సాయం చేసాము. ఏ రాష్ట్రంలోనూ ఇవ్వనన్ని ఇక్కడ ఇస్తున్నాము అంటూ సభలో కేసీఆర్ ప్రసంగించారు.

రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతుండడంతో భాజపా తెలంగాణలో తన ప్రచారాన్ని వేగవంతం చేసింది. భాజపా అగ్ర నేతలు రాష్ట్రానికి దండయాత్ర చేస్తున్నారు. ప్రధాని, అమిత్ షా, నడ్డా ఇప్పటికే ఎన్నోసార్లు ప్రచార సభలో పాల్గొనగా, మరలా రాష్ట్రానికి రానున్నారు. ప్రచారాన్ని హోరెత్తించడమే లక్ష్యంగా అగ్ర నాయకత్వం ఎన్నికల పోలింగ్ వరకూ తెలంగాణాపై దండయాత్ర చేయనుంది.

కాంగ్రెస్ విజయభేరి ఆసిఫాబాద్ లో ఎన్నికల ప్రచారంలో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ , అందులో భాగంగా ఆసిఫాబాద్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కాంగ్రెస్ విజయ భేరి మోగిస్తూ, పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ తో కలిసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మొత్తం 35, 635 పోలింగ్ కేంద్రాలు- వికాస్ రాజ్

తెలంగాణా ఎన్నికల నేపథ్యంలో 60 మంది వ్యయ పరిశీలకులను నియమించామని, పోలింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 18--19 ఏళ్లమధ్య ఉన్న ఓటర్లు 9.9 లక్షల మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు ఇప్పటికే ఓటు హక్కు వినియోగించుకున్నారు. శాసనసభ ఎన్నికల పోలింగ్ కోసం 36 వేల ఈవీఎం లు సిద్ధం చేయగా, ఈ సారి కొత్తగా 51

లక్షల ఓటరు కార్డులు ప్రింట్ చేసి, తపాలాశాఖ ద్వారా పంపిణీ చేశాం. 60 మంది వ్యయ పరిశీలకులను నియమించడమే కాక, 3 కేటగిరీల వారికి హోమ్ ఓటింగ్ అవకాశం కల్పించాం. ఇప్పటికే 9000 లకు పైగా ఓటర్లు హోం ఓటింగ్ వేసారు. అంతే కాదు 86 శాతం స్లిప్పుల పంపిణీ పూర్తి చేశాం. రాష్ట్రం మొత్తంలో 35,635 పోలింగ్ కేంద్రాలు, ఆరు నియోజకవర్గాల్లో 5 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రాల్లో నే పోలింగ్ సిబ్బందికి అన్ని సదుపాయాలూ కల్పిస్తూ, ప్రతి కౌంటింగ్ సెంటర్ కు ఒక పరిశీలకులు ఉండేటట్లు ఏర్పాటు చేసాం అని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు.

ఫిబ్రవరి నెలకు సంబంధించిన రూ 300ల ప్రవేశ దర్శనం -

టిక్కెట్ల కోటాను నవంబర్ 24 ఆన్ లైన్ లో 2024 ఫిబ్రవరి నెలకు సంబంధించిన రూ 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల కోటాను నవంబర్ 24 న ఉదయం 10 గంటలకు ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు తితిదే తెలిపింది.

బాలమురళీకృష్ణ వర్ధంతి నవంబరు 22న

ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న 'బాలమురళి' చిరస్మరణీయులు.

శబరిమలకు 22 ట్రిప్పుల ప్రత్యేక రైళ్లు

శబరిమల వెళ్లి వచ్చే భక్తుల కోసం తెలుగు రాష్ట్రాల నుంచి అయ్యప్ప భక్తుల కోసం రాను పోను కలిపి 22 ట్రిప్పుల ప్రత్యేక రైళ్లు నడిపించనున్నట్లు ద.మ. రైల్వే తెలిపింది. విజయవాడ నుంచి కొట్టాయంకు డిసెంబర్ 1,8,15,22,29 జనవరి 5,12,19 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి కొల్లం కు డిసెంబరు 8, జనవరి 12, 19 తేదీల్లో ప్రత్యేక రైళ్లు ప్రయాణీకులకు అందుబాటులో ఉంటాయి. తిరుగు ప్రయాణంలో కొట్టాయం నుంచి విజయవాడకు డిసెంబరు 3,10. 17, 24, 31 జనవరి 7,14, 21 తేదీల్లో కొల్లం నుంచి సికింద్రాబాద్ కు జనవరి 9,13, 20 తేదీల్లో ప్రత్యేక రైళ్లు బయలుదేరుతాయి.

ఓటు జరా భద్రం!

ఓటు చాలా ముఖ్యమైనది. పవిత్రమైనది. ముఖ్యమైనది అంటే మన బ్రతుకులను శాసిస్తుంది. మన జీవితాలన్నీ మనలను పరిపాలించే వారి పైనే ఆధారపడి ఉంటాయి. అంతే కాదు, మన దేశ భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు లాంటి ఎన్నో విషయాలపై మన ఓటు ఆధారపడి ఉంటుంది. మన దేశాన్ని నిస్వార్ధంగా, మనం పన్నుల రూపంలో కట్టే డబ్బును జాగ్రత్తగా మన కోసమే ఖర్చు చేస్తూ, ఎన్నో పరిశ్రమలు తీసుకు రావాలి. పిల్లలు వారి తెలివి తేటలన్నీ మన దేశానికే ఉపయోగిస్తూ, పిల్లలు పరాయి దేశాల పాలవ్వకుండా చూసే ప్రభుత్వాలు మనకి రావాలి. మన సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రాధాన్యత నిచ్చే ప్రభుత్వాలు రావాలి. సామాన్యుడు కూడా కడుపు నిండా తింటూ , హాయిగా జీవనం గడిపే టట్టు చూసే ప్రభుత్వం రావాలి. విదేశాల నుండి మన ప్రజలను నిరంతరం కాపాడుతూ ఉండే ప్రభుత్వాలు మనకి రావాలి. ఉచిత పథకాలు అంటూ హోరెత్తించకుండా, ప్రజలలో కష్టపడి పని చేసే పథకాలను తీసుకు రావాలి. చాలా జాగ్రత్తగా మోసపోకుండా, డబ్బులకు అమ్ముడు పోకుండా, మీ ఓటును తప్పుగా వేయకుండా చాలా జాగ్రత్తగా వెయ్యండి. ముందు పాలకులు ఎలా పరిపాలించారో మీకు తెలుసు. మీ జీవన విధానం ఎలా సాగిందో, దేశం ఎలా ఉందో, మీకు తెలుసు. అన్ని విషయాలు ఆలోచించి మాత్రమే ఓటు వేయండి. డబ్బులకు, సీసాలకు దాసోహం కాకండి. మీ ఓటుపై మీ ఒక్కరి జీవితమే కాదు రాష్ట్ర, దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని గ్రహించండి. మన రాజ్యాంగంలో వ్రాసుకున్నట్లుగా, ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వల్ల పరిపాలించే ప్రభుత్వం రావాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది. కొత్త ప్రభుత్వానికి ఆహ్వానం పలుకుతూ ...



**సర్వేజనా సుఖినోభవంతు**

తీగవరపు శాంతి


# మహాభారతంలో గాంధారి



పాలకుర్తి రామమూర్తి



పర్వతం ఎత్తు కనిపిస్తుందే కాని సముద్రంలోతు కనిపించదనేది లోకోక్తి. ఈ సందర్భంలో పర్వతాన్ని పురుషునిగా, సముద్రాన్ని స్త్రీగా చెపుతారు. సమద్రగర్భంలో బడబాగ్ని దాగి ఉన్నా పైకి మాత్రం గంభీరంగా ఉంటుంది. అలాగే స్త్రీ హృదయంలో ఎన్ని అగ్ని పర్వతాలు బ్రద్దలౌతున్నా నిబ్బరంగా ఉండడం స్త్రీ జాతికి మాత్రమే సాధ్యమంటారు. మహాభారతంలో కుంతి, గాంధారి, ద్రౌపది పాత్రల ప్రాధాన్యత ననుసరించి వారిని శక్తిత్రయంగా చెపుతారు. నిజానికి ఈ మూడు పాత్రలే మహాభారత యుద్ధానికి కారణమని కొందరి వాదన కూడా. ఏది ఎలా ఉన్నా.. అందులో గాంధారి పాత్ర ధర్మానికి, బుద్ధిమత్వానికి, ప్రశాంత మనస్సుకు, పాతివ్రత్యానికి ఎంతగా ప్రతీకగా నిలుస్తుందో అలాగే ఆమెలో ఛాయగా అసూయాద్వేషాలు కూడా కనిపిస్తాయి. ఆమె వ్యక్తిత్వానికి Learn to Balance both Action and Inaction అన్న సూక్తి చక్కగా సరిపోతుంది. గాంధార దేశ రాజు సుబలుని కుమార్తె గాంధారి. ఆమెను ధృతరాష్ట్రునికి ఇచ్చి వివాహం చేయాలని నిర్ణయించాడు, సుబలుడు. ఆ నిర్ణయాన్ని ఆమోదించాడు, ఆమె అన్న అయిన శకుని. వెంటనే ఆమె ధృతరాష్ట్రుని భర్తగా అంగీకరించి కాబోయే పతికి అనుగుణమైన రూపాన్ని ఊహించుకొని ఆయనకు లేని



కళ్ళు తనకూ అవసరం లేదని తన కళ్ళకు గంతలు కట్టుకున్న వ్యక్తిత్వం ఆమెది. దానితో పుట్టుకతో గ్రుడ్డిదనం ధృతరాష్ట్రునిది కాగా కళ్ళుండీ చూడలేని గ్రుడ్డితనం ఆమెది అయింది. అజ్ఞానానికి వెలుగు బాట కనిపించదు.. జాత్యంధతను అనుసరించిన అజ్ఞానమూ అదే మార్గంలో నడిచింది.

"జనము నుతించు నీదు గురుసారధీర బుద్ధిన్ అన్నాడు వేదవ్యాసులు ఒకమారు.. అలాగే.. "నిను అతి శాంత చిత్తని నిక్క మేను గందు" అంటాడు మరొక చోట వ్యాసుల వారామెను. "నీవలిగి చూచినన్ ద్రిలోకంబులు భస్మీభూతంబులగునట్టి తపః ప్రభావంబునన్ ప్రసిద్ధవు" అంటాడు, కృష్ణుడు. అంతటి ఉదాత్త వ్యక్తిత్వం గాంధారిది. ఆమె "The level of Tolerance and acceptance of happenings of Life is very high" అన్న లోకోక్తికి ప్రతీకగా నిలుస్తుంది.

విలువలు (Values), నీతి నియమాలు (Ethics), నైతికత (Morals), లతో కూడిన జీవితాన్ని గడిపిన స్త్రీమూర్తి, గాంధారి. మనం ఏర్పరుచుకున్న కొన్ని నియమాల ప్రాతిపదికగా వ్యవహరిస్తే అది విలువలతో కూడిన జీవితం.. సామాజిక నియమాలతో కూడిన జీవితాన్ని అంగీకరిస్తే అది నీతి నియమాల ఆధారిత జీవితం.. ధార్మికబద్ధమైన జీవితాన్ని ఆస్వాదిస్తే అది నైతిక జీవితంగా చెప్పుకోవచ్చు. విలువలు మనం ఏర్పరుచుకున్నవి, నీతి నియమాలు చట్ట బద్ధమైనవి కాగా నైతికత ధర్మబద్ధమైనదిగా చెప్పుకోవచ్చు.

గాంధారికి సంతాన కాంక్ష హెచ్చు. దానికి తగిన రీతిగా శివుని వల్ల వరాన్నీ పొందింది. తాను గర్భవతి అయింది. మౌని "కిందముని" శాపం వల్ల పాండురాజుకు సంతానయోగం లేదని, తన భర్త గ్రుడ్డివాడవడం వల్ల కోల్పోయిన రాజ్యాధికారం, తన సంతానానికే ఇకపై దక్కుతుందని కలలు కన్నది గాంధారి. అయితే నియోగ పద్ధతి ద్వారా భర్త అనుమతితో ఆమె తోటికోడలు కుంతి గర్భాన్ని ధరించి కుమారుని ప్రసవించిందని వినగానే ఆమె ఆశలు అడియాస లయ్యాయి. కురు కుమారులలో తన కుమారుడే పెద్దవాడవుతాడని, రాజ్యాధికారం తన సంతానానికే దక్కు-



తుందని భావించిన గాంధారిలో కుంతికి కుమారుడు కలగడం.. అతడు తన సంతానాని కన్నా పెద్దవాడవడంతో ఆమెలో ఆవేదనను నింపింది. దానితో ఆమెలో పెల్లుబికిన అసూయా-ద్వేషాలు, క్రోధాలు ఆమెలోని సున్నితత్వాన్ని చిదిమివేసాయి. ఆవేశంలో కడుపును బాదుకున్నది.. ఫలితంగా 100 మంది కుమారులు ఒక కూతురు కలిగారు.

భారతంలో ఆమె పాత్ర ఎంత ఉదాత్తతను సంతరించుకున్నా ఈ సంఘటన ఆమెలోని అసూయాద్వేషాల లోతైన లోయలాగే కనిపిస్తుంది.

ద్రౌపదీ మానభంగం సమయంలో భీష్మాదులు మౌనాన్ని వహిస్తే.. గాంధారి మాత్రం.. పరిస్థితిని అవగహన చేసుకొని, విదురుని వెంటబెట్టుకొని భర్తవద్దకు వెళ్ళి.. విషయ తీవ్రతను వివరించింది. పరిస్థితిని చక్కదిద్దమని సలహా ఇచ్చింది. ఆ సలహా మేరకే ధృతరాష్ట్రుడు ద్రౌపదికి వరాల నివ్వడం జరిగింది. అయితే ఆ ప్రయత్నం కొద్ది ముందుగా జరిగి ఉంటే.. ద్రౌపదికి సభలో అవమానం జరిగి యుండకపోవచ్చుననే వాదనా ఉన్నది. అయితే.. సభలో విజ్ఞులైన భీష్మద్రోణాదులే దుష్టచతుష్టయ చేష్టలకు నిశ్చేష్టులైన సందర్భంలో ఆమె కూడా దిక్కుతోచక కింకర్తవ్య విమూఢ చిత్తయై కూర్చున్నది అనుకోవచ్చు కూడా.

దుర్యోధనుడు పుట్టగానే నక్కలా అరిచాడని.. వీడు కులనాశకుడు అవుతాడని, వాడిని విడిచివేయ వలసినదని విదురుడు ధృతరాష్ట్రునికి సలహా ఇచ్చాడని చెపుతారు. కులక్షయమైనా కానీయి.. పుత్రుని విడిచే ప్రసక్తి లేదని ధృతరాష్ట్రుడు చెప్పాడని చెపుతారు. జూదసమయంలో ఆమె ఆ మాటలు జ్ఞాపకం చేస్తూ .. స్వయంకృతాపరాధంతో మహా సముద్రంలో నీవు మునిగిపోవద్దు... అజ్ఞానులు, అయోగ్యులు, అధర్మచిత్తులైన వారి బుద్ధిని ఆదరించవద్దని, వారి చేష్టలను అనుమతించవద్దని నిష్కర్శగా చెప్పడం పుత్రప్రేమనూ ప్రక్కన పెట్టిన, ఆమెలోని ధర్మదృష్టికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

కృష్ణ రాయబార సమయంలో ధృతరాష్ట్రుడు గాంధారిని సభలోనికి పిలిపించి ఆమెతో ధర్మాన్ని దుర్యోధనునికి చెప్పించడం కనిపిస్తుంది. అయితే ఆ సందర్భంలో కుమారునికన్నా ముందుగా భర్తకే ఆమె హితోపదేశం చేయడం ఆమెలోని విజ్ఞతకు ధర్మనిరతికి తార్కాణం. నీ కుమారుడు అవినీతి పరుడని తెలిసీ వాని మార్గానే ఎందుకు వెళతావు.. నీవు పాండవులకు ఏమిచ్చినా ఎంత ఇచ్చినా కాదనే వారు

ఎవరు? అంటూ సభలోనే ప్రశ్నించడం ఆమె ధైర్యానికి న్యాయ దృష్టికి నిదర్శనం. రాజ్యం పాండురాజుదని, న్యాయంగా సంక్రమించిన కురురాజ్యాన్ని ధర్మరాజే పాలించాలని సభలో చెప్పగలిగిన నైతిక వర్తన ఆమెది.

యుద్ధానికి వెళుతూ..దుర్యోధనుడు ఆశీస్సులు కోరితే.. "యతోధర్మస్తతో జయః" ఎక్కడ ధర్మం ఉన్నది అక్కడే జయము ఉంటుంది.. అనగలిగిన స్థైర్యాన్ని ప్రదర్శించిన ధీశాలి గాంధారి. ఉదాత్తమైన ఆమె పలుకులలో ఆమె పలికే ప్రతిమాటను ఎంత జాగ్రత్తగా పలుకుతుందో అవగతమౌతుంది. దుర్యోధనుని "జయోస్తు" అని దీవిస్తే అతడు విజయాన్ని పొందితే.. ఆమె అధర్మాన్ని ఆదరించినట్లవుతుంది.. ఒకవేళ పాండవులే జయిస్తే తన దీవన ప్రతిహతమవడమే కాక తనకు అసత్య దోషం అంటుకుంటుంది.

ఎంతటి సమతామూర్తియైనా ఆమెలోని మాతృత్వం 100 మంది కుమారులు మరణించారని తెలిసాక కట్టలు తెంచుకున్నది. విదురుడు ఓదార్చినా, పాండవులు ఆమె పాదాలనంటి నమస్కరించినా ఆమెలో కోపావేశాలు చల్లారలేదు... వారిని శపించేందుకు సన్నద్ధమయింది. అదే సమయంలో వ్యాసులవారు వచ్చి ఆమెను ఓదార్చడం, మాత్సర్యంతో వారిని శపించవద్దని కోరడంతో ఆమె శాంతించింది. ధర్మరాజును ఆమె "నా సంతానంలో ఒక్కడు



కూడా మీకు అపకారం చేయని వాడు లేడా" అంటూ ప్రశ్నించడం ఆమె పుత్రశోకానికి పరాకాష్టగానే చెప్పుకోవాలి. అందరిపై ఉన్న కోపం.. కృష్ణుని శపించడంతో చల్లారింది. కృష్ణుడు కూడా ఆవేశపడకుండా.. "తల్లీ, నీ కొడుకు చేసిన కీడుకు నన్ను నిందిస్తావా" అంటూ ప్రశ్నించడంతో ఆమె ఆవేశం చల్లారి.. పశ్చాత్తాపానికి గురైంది. తదుపరి కొంతకాలానికి భర్తతో కలసి ఆశ్రమవాసానికి వెళ్ళడం.. అక్కడే మరణించడం కనిపిస్తుంది, భారతంలో.


ఎంతటి ఉదాత్తమూర్తులైనా, ఆలోచనాశీలురైనా, ధార్మిక చింతనులైనా, ఎంతటి ప్రశాంత మనస్కులైనా, స్త్రీలలో మాతృత్వకాంక్ష, పుత్రశోకం ఈ రెండూ వారిని ఎంతగా ప్రభావితం చేస్తాయో... సమతను కోల్పోయేందుకు ఉపకరిస్తాయో.. భారతంలో గాంధారి పాత్ర మనకు తెలియచేస్తుంది. బేలతనం కనిపించని ధీరోదాత్తత ఆమెది. విజ్ఞతామూర్తిగా భర్తకు సలహాలనివ్వగలిగిందే కాని భర్తను, కుమారులను మార్చలేకపోయింది. ఆనాటి సామాజిక పరిస్థితులలో ఆమె పరిధిలో యుద్ధ నివారణకు ఆమె చేసిన ప్రయత్నం అభినందనీయమనే చెప్పాలి.

చివరగా భావోద్వేగాలు వ్యక్తి జీవితంలో ఎలాంటి పరిణామాల్కు దారితీస్తాయో చెప్పేందుకు గాంధారి పాత్ర ఒక ఉదాహరణ. ఎంతగా వాటిని అధిగమించినా వాటి ప్రాభవాన్ని పూర్తిగా జయించడం అసాధ్యం కాకపోయినా కష్టసాధ్యం అనవచ్చు. మహాభారతంలో ఆమెను ఒక గొప్ప మానవీయ స్త్రీ మూర్తిగా చెప్పుకోవాలి. నా పరిధిలో, నా అవగాహనమేరకు చిత్రించిన గాంధారి వ్యక్తిత్వ చిత్రణమిది. What must be done must be done in spite of your setbacks due to your personal emotions and a kingdom should not suffer because of the personal emotions of the king అన్న సూక్తి ఆమె వ్యక్తిత్వంలో కనిపిస్తుందని విశ్వసిస్తూ...

పాలకుర్తి రామమూర్తి

# వార్తా విశేషాలు

తెలుగు రాష్ట్రాల్లో కార్తీక వైభవం
- శివాలయాల్లో పూజలు
కార్తీక మాస సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో పుణ్య క్షేత్రా-న్ని కిటకిటలాడుతున్నాయి. రాజమహేంద్రవరం, భద్రాచలం, విజయవాడ నదుల్లో భక్తులు పుణ్యస్నానాలు చేసి, అనంతరం నదుల్లో దీపాలు వదిలి పూజలు నిర్వహిస్తున్నారు.





ఎన్నికల జోరు
స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా రావాల్సిన ప్రజాస్వామ్యం ఇంకా రాలేదని భారాస అధినేత సీఎం కేసీఆర్ అన్నారు. పార్టీల చరిత్ర, నడవడిక చూసి ఓటేయాలని, నిజా నిజాలు గమనించి ఓటేయాలని కోరుతున్నా ... పదేళ్ల ముందు పాయాలకుర్తి ఎలా ఉందో, ఇప్పుడెలా ఉందో ప్రజలు గమనించాలి.

గతంలో వేలమంది ఇక్కడనుండి వలస పోయేవారు. ఇప్పుడు ఇతర ప్రాంతాలనుండి ఇక్కడకు వస్తు-న్నారు అన్నారు సీఎం కేసీఆర్.

---

రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ



రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే స్టేషన్ ఘనపూర్ కు రెండు పనులు చేయించే బాధ్యత తాను తీసుకుంటానని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. స్టేషన్ ఘనాపూర్ కి వంద పడకల ఆసుపత్రి , డిగ్రీ కాలేజీ తీసుకొస్తామని అన్నారు. పదేళ్ల భారాస పాలనలో తెలంగాణా ప్ర-జలకు చేసిందేమీ లేదని, బిల్లులు రాక సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటామని అం-టున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రాలో అధికారం కోల్పోతామని తెలిసినా సోనియా గాంధీ తెలంగాణా ఇచ్చారని అన్నారు. భారాస వంద తప్పులు పూర్తయ్యాయని, ఇక కాంగ్రెస్ విజయం ఖాయం అని అన్నారు.

---

18 న తెలంగాణలో అమిత్ షా సభలు --- ఒకే రోజు నాలుగు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 18 న రాష్ట్రానికి రానున్నారు. అదే రోజు సోమాజిగూడలో-ని భాజపా మీడియా సెంటర్ లో తెలంగాణా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు.

అనంతరం నల్గొండ , వరంగల్, గద్వాల్ , రాజేంద్ర నగర్ సభల్లో అమిత్ షా పాల్గొంటా- రని భాజపా వర్గాలు తెలిపాయి.



ఆల్ - షిఫా ఆసుపత్రిలో బందీలుగా హమాస్

ఇజ్రాయెల్ నుంచి కిడ్నాప్ చేసిన బందీల్లో కొందర్ని అక్టోబర్ 7 నాటి దాడి తర్వాత హమాస్ .. ఆల్ - షిఫా ఆసుపత్రిలో దాచినట్లు , బందీలుగా దాచిపెట్టిన ఓ వీడియోను ఐ డి ఎఫ్ ఎక్స్ వేదికగా బయట విడుదల చేసింది. ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది కొంతమంది ని బందించేందుకు తీసుకురావడం . అక్టోబర్ 7న ఉదయం 10 . 42 నుంచి 11 గంటల మధ్య ఆల్ -- షిఫా ఆసుపత్రి సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు ఐడిఎఫ్ విడుదల చేసింది. ఆ కెమెరాల్లో చేతిలో ఆయు-ధాలతో ఉన్న హమాస్ ఉగ్రవాదులు కనిపిస్తున్నారు. ఓ వ్యక్తి నైతే బలవంతంగా లోపలికి లాక్కెడు-తున్నట్లు, తీవ్రంగా గాయపడిన మరో బందీని ఆసుపత్రి థియేటర్లోకి తీసుకెడుతున్నట్లు రికార్డు అయ్యింది. దీనిపై ఐడిఎఫ్ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ స్పందిస్తూ , ఆ బందీలు నేపాల్ , థాయిలాండ్ దేశస్థులని తెలిపారు. వారి పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది అనేది ఇంకా తెలియలేదు. ఇజ్రాయెల్ పై నారా మేధం జరిపిన రోజున మాత్రం ఆల్ -- షిఫా ఆసుపత్రిని వారు వినియోగించు-కున్నారని మాత్రం స్పష్టం అవుతోంది అని ఇజ్రాయెల్ సైన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది.

నిరాశతో ఉన్న టీమిండియాకు కు మద్దతుగా మోదీ ..

ఓటమి తర్వాత డ్రెస్సింగ్ రూమ్ కు మోదీ

వన్డే ప్రపంచకప్ టోర్నీ లో అత్యుత్తమ ప్రద-ర్శనతో ఫైనల్ చేరిన టీమిండియా ... చివరి ఆటలో విఫలమవడంతో






మెగా కప్పు కల చెదిరిపోయింది. తమ గడ్డపై తామే ఓటమి పాలయ్యేసరికి, భారత్ ఆటగాళ్లతో పాటు కోట్లాది మంది అభిమానుల హృదయాలను ముక్కలు చేసింది. ఈ ఓటమిని జీర్ణించుకోలేక టీమిండియా ఆటగాళ్లు మైదానంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇలాంటి సమయంలో నిరాశలో కూరుకుపోయిన మన జట్టుకు భరోసా నిచ్చి, ఉత్సాహ పరిచేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ డ్రెస్సింగ్ రూమ్ కి ఆటగాళ్లను తీసుకెళ్లి ఓదార్చారు. ఈ విషయాన్ని ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా సోషల్ మీడియాలో వెల్లడిస్తూ, ప్రధానితో ఉన్న ఫోటోను పంచుకున్నారు. ఈ గొప్ప టోర్నమెంట్ లో అద్భుతంగా రాణించి నప్పటికీ, మేం నిరాశతో ముగించాం. మా గుండె బద్దలైంది. కానీ ప్రధాని మోడీ మా డ్రెస్సింగ్ రూమ్ కి రావడం ప్రత్యేకంగా అనిపించింది. ఎంతో ప్రేరణనిచ్చింది. అంటూ జడేజా రాసుకొచ్చారు. షమీ కూడా మరో ఫోటోను షేర్ చేస్తూ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. మళ్ళీ బలంగా తిరిగొస్తామని పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ఉప ప్రధాని రిచర్డ్ మార్లెస్ తో కలిసి ఈ మ్యాచ్ ను తిలకించారు. అనంతరం ఇరు జట్ల ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇస్తూ అభినందించారు. ఆస్ట్రేలియా సారథి కమిన్స్ వీరిద్దరూ ట్రోఫీని అందజేశారు.

చివరగా కప్పు ఆస్ట్రేలియాకు, నిరాశ, భారత క్రికెట్ అభిమానులకు అని చెప్పక తప్పదు.



## చంద్ర బాబుకు బెయిల్ మంజూరు



స్కిల్ డెవలప్ మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ టి. మల్లిఖార్జునరావు ఈ నెల 28న రాజమహేంద్రవరం జైలుకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతులు ఈ నెల 28 వరకే వర్తిస్తాయని .. 29వ తేదీనుంచి రాజకీయ ర్యాలీలు, సభల్లో సభల్లో చంద్రబాబు పాల్గొనవచ్చని న్యాయమూర్తి తెలిపారు. అయితే ఈ నెల 30 న మాత్రం ఏసీబీ కోర్టు ముందు చంద్ర బాబు హాజరు కావాలని ఆదేశించారు. చికిత్సకు సంబంధించిన నివేదికను ఏసీబీ కోర్టులో అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

---

## హైవేలపై పాదచారులు తిరగకూడదు -- సుప్రీం కోర్టు

వాగాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని, పాదచారులు హైవేలపై తిరగకూడదని, ఈ మేరకు క్రమ శిక్షణ అవసరమని పేర్కొంది. హైవేలపై పాదచారుల భద్రతా అంశాన్ని లేవనెత్తుతూ దాఖలైన ఓ పిటిషన్ ను నిరాకరిస్తూ, ఈ మేరకు సుప్రేం కోర్టు సూచనలు చేసింది. ఇదే అంశమై పిటిషనర్లు ఇంతకు ముందు గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ ను కొట్టేసిన హైకోర్టు, కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖను సంప్రదించాలని సూచించింది. దీంతో గుజరాత్ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ పిటిషనర్లు సుప్రేం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షు ధూళియాలతో కూడిన సుప్రేం కోర్టు ధర్మాసనం పరిశీలించింది.

---

## వైకాపా ప్రభుత్వం లో హిందూపురం ఆస్పత్రిలో సమస్యలు ... బాల కృష్ణ

శ్రీ సత్య సాయి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను గురించి ఆరా తీసి, మాతా శిశు కేంద్ర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత, అక్కడి సదుపాయాల గురించి బాలకృష్ణ మాట్లాడుతూ, ఆసుపత్రిలో సిటీ స్కాన్ సౌకర్యం, దుప్పట్లు లేవని తెలిపారు. అంతేకాదు ఆసుపత్రి లో సమస్యలు పెరిగాయని అన్నారు.

## చమురు గ్యాస్ ధర కట్టడి చేసింది భారత్ -- జై శంకర్



భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం ద్వారా అంతర్జాతీయంగా మార్కెట్ లో ధరలు పెరగకుండా నియంత్రించగలిగామని కేంద్ర విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న సమయంలో భారత్ కొనుగోలు విధానంతో, చమురు గ్యాస్ ధరలు పెరగకుండా అంతర్జాతీయ ద్రవ్యోల్బణాన్ని నియంత్రించ కలిగింది. అందుకు మిగిలిన దేశాలు భారత్ కు కృతజ్ఞతలు చెప్పాలని లండన్ లో భారత్ హై కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

---

## అస్సాం రైఫిల్స్ బలగాలకు తృటిలో తప్పిన ప్రమాదం

మణిపూర్ లో మరోసారి తీవ్రవాదులు రెచ్చిపోయారు. అస్సాం రైఫిల్స్ బలగాలు ప్రయాణిస్తుంటే, అదే వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మందుపాతర పేల్చగా, ఆ బలగాలకు తృటిలో ప్రమాదం తప్పింది. బలగాలు ప్రయాణం చేస్తున్న వాహనం పేలుళ్లను తట్టుకునేది కావడంతో, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. పేలుడు అనంతరం అస్సాం రైఫిల్స్ వాహనంపైకి తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ప్రతిగా అస్సామ్ రైఫిల్స్ కూడా కాల్పులు జరపడంతో తీవ్రవాదులు అక్కడి నుంచి పారిపోయారు అని తెలిపారు. ప్రస్తుతం భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో ప్రత్యేక సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ దాడి కోసం తీవ్రవాదులు తక్కువ తీవ్రత కలిగిన మందు పాతర ఉపయోగించారని సైనికాధికారులు తెలిపారు.

కిందటి నెలలో మణిపూర్ లోని మరి ప్రాంతంలో తీవ్రవాదులు ఓ పోలీసు అధికారిని కాల్చి చంపారు. ఈ సంఘటనతో మోరే ప్రాంతంలో 200 మంది అస్సాం రైఫిల్స్ సిబ్బందిని మోహరించారు. మరో వైపు మయన్మార్ వచ్చే చొరబాటుదారులను అడ్డుకునేందుకు వీరు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు సైన్యం తెలిపింది. కిందటి వారం మణిపూర్ పోలీస్ కమాండోలు ప్రయాణిస్తున్న కాన్వాయిపై తీవ్రవాదులు మెరుపు దాడి చేస్తుంటే, అదే సమయంలో అటుగా వెడుతున్న అస్సామ్ రైఫిల్స్, సాహసోపేతంగా వారిని కాపాడింది. ఈ దాడిలో ముగ్గురు కమాండోలు గాయపడ్డారు. రెండు వారాల వ్యవధిలో ఇది రెండో దాడి.

---

## రత్నగిరిలో తిమింగలం పిల్ల మృతి

ఓ పిల్ల తిమింగలం తల్లి నుంచి దారి తప్పి ఒడ్డుకు కొట్టుకు వచ్చి, ప్రాణాలు కాపాడుకునేందుకు అవస్థలు పడుతోంది. దాని పరిస్థితి చూసి చాలించిన స్థానికులు, తమ శక్తికి మించిన పనైనా గంటల తరబడి శ్రమించి సముద్రంలోకి పంపారు. దాని ప్రాణాలు కాపాడామని సంబర పడ్డారు. కానీ ఆ ఒక్క రోజులో ఆ

పిల్ల తిమింగలం, ప్రాణాలు కోల్పోయి అచేతనంగా తీరానికి కొట్టుకు వచ్చింది. దీనిని గమనించిన స్థానికులు అధికారులకును సమాచారం అందించారు. ఇది నాలుగు టన్నుల బరువుండడంతో ఇసుకలో కూరుకు పోయింది. అక్కడున్న వారంతా దాన్ని బయటకు లాగేందుకు విశ్వ ప్రయత్నాలు చేసి, బెల్ట్ కట్టి బయటకు లాగారు.

---

అమెరికన్ మిలియనీర్ కు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ సమన్లు

భారత్ కు చెందిన ఆన్ లైన్ వార్తల పోర్టల్ న్యూస్ క్లిక్ కేసులో అమెరికా మిలియనీర్ నెవిల్లే రాయ్ సింగం ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. న్యూస్ క్లిక్ కు బీజింగ్ నుంచి చైనాకు అనుకూలంగా రాసేందుకు నిధులు అందుతున్నాయని ఈ ఏడాది ఆగస్టులో అమెరికా పత్రికలూ కథనాలు వెలువరించాయి. నెవిల్లే రాయ్ సింగం, ఆయనకు చెందిన న్యూస్ క్లిక్ ప్రమాదకరమైనవి అని, దీనిపై కేసు నమోదు చేసి సోదాలు చేపట్టిన ఈడీ కొన్ని ఆస్తులను కూడా జప్తు చేయడం జరిగింది. అంతే కాదు మనీలాండరింగ్ చట్టం కింద భారత విదేశాంగ శాఖ ద్వారా చైనాలోని షాంఘై లో ఉన్న నెవిల్లే రాయ్ సింగ్ కు నోటీసులు పంపడమే కాక, ఆయన వాదనలు రికార్డు చేసేందుకు ఢిల్లీ కోర్టు అనుమతించిన నేపథ్యంలో ఈడీ రెండో సారి కూడా సమన్లు జారీ చేసింది. తనపై వచ్చిన ఆరోపణలు నెవిల్లే ఇప్పటికే ఖండించారు. 2021 సెప్టెంబర్ లో ఢిల్లీ లోని న్యూస్ క్లిక్ కార్యాలయంలో ఈడీ సోదాలు చేసింది చైనా నుంచి నిధులు అందుతున్నాయనే ఆరోపణలతో. అనంతరం న్యూస్ క్లిక్ ఎడిటర్ --ఇన్ చీఫ్ ప్రబీర్ పురకాయస్థ సహా 25 మంది వాంగ్మూలాన్ని నమోదు చేసి, ఈడీ ఇచ్చిన సమాచారంతో రెండు నెలల క్రితం ఢిల్లీ పోలీసులు ఉగ్రవాద వ్యతిరేక చట్టం ఉపా కింద కేసు నమోదు చేసి అనంతరం ప్రబీర్ ను అరెస్టు చేశారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం నిబంధనలను ఉల్లంఘించిందని సీబీఐ కేసు నమోదు చేసి ప్రబీర్ నివాసం , కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి ఆస్తులను జప్తు చేసింది.

---

సునాక్ పై విరుచుకుపడ్డ సుయెల్లా బ్రేవర్ మన్

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కు నాయకత్వ లక్షణాలు లేవని, దేశంలో జరుగుతున్న విద్వేష ర్యాలీలపై చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపిస్తూ , బ్రే వర్మన్ ఓ లేఖ విడుదల చేశారు. అంతే కాదు ఆయనపై విరుచుకుపడ్డారు. కొద్ది రోజుల క్రితం లండన్ లో పాలస్తీనా మద్దతుదారుల ర్యాలీని నియంత్రయించడంలో పోలీసుల తీరుపై బ్రేవర్మన్ విమర్శలు చేయడంతో, ఆమెను మంత్రి వర్గం నుంచి సునాక్ తొలగించడం జరిగింది. ప్రధాని అభ్యర్థిగా పోటీలో ఉన్నప్పుడు, పలు అంశాలపై ఇచ్చిన హామీల కారణంగానే మీకు మద్దతిచ్చాను. వాటిలో అక్రమ వలస, చిన్న పడవల



ద్వారా బ్రిటన్ లోకి ప్రవేశించే వారి కట్టడి, నార్తర్న్ ఐలాండ్ ప్రోటోకాల్ తో పాటు పలు కీలక అంశాలకు సంబంధించి మీరు హామీలు ఇచ్చారు. కానీ వాటిని నెరవేర్చడంలో విఫలమయ్యారు. మీ నిర్ణయాలు పని చేయడం లేదు. బ్రిటన్ లో జరుగుతున్న ర్యాలీలు, అతి వాదంపై చర్యలు తీసుకోలేక పోతున్నారు. మీ స్పందన బలహీనం గా ఉంది. ఈ దేశ ప్రధానికి ఉండవలసిన నాయకత్వ లక్షణాలు మీలో లేవు. ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కోక తప్పదు, మీ పని తీరు మార్చుకోవాలి అని బ్రేవర్మన్ లేఖలో పేర్కొన్నారు

అగ్రరాజ్యంలో అడుగు పెట్టిన జిన్ పింగ్



ఆసియా --పసిఫిక్ సహకార మండలి శిఖరాగ్ర సదస్సుకు హాజరయ్యేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ అగ్రరాజ్యంలో అడుగు పెట్టారు. అసలే అమెరికా --చైనా మధ్య వాణిజ్య పరమైన ఉద్రిక్తత-లు కొనసాగుతున్న వేళ తీవ్ర పరిణామం చోటుచే-సుకుంది. 2017 లో ఆయన అమెరికాలో పర్యటిం-చిన ఆరేళ్ళ తర్వాత మళ్ళీ ఇప్పుడే .

ప్రతిపక్షాల పై విమర్శలు గుప్పించిన కేటీఆర్



భారాస అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రిని తనకు పర్యాటక శాఖ అడుగుతానని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆరు దశాబ్దాలలో కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం ఆరున్నరేళ్ల కాలంలో అనూహ్య అభి-వృద్ధిని సాధించామని, శుక్రవారం జరిగిన ఒక కార్య-క్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ అన్నారు. డిసెంబర్ 3 తరువాత సీఎం కేసీఆర్, 18 ఏళ్ళు నిండిన ఆడబి-డ్డలందరికీ సౌభాగ్య లక్ష్మి పేరుతో నెలకు రూ 3000 మీ ఖాతాలో వేస్తాం అని కేసిఆర్ అన్నారు అని కేటీఆర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా ఖానాపూర్ జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ అన్నారు.

**ధూమపానంతో ఏటా క్యాన్సర్ మరణాలు 13 లక్షలు**




ధూమపానం కారణంగా క్యాన్సర్ బారిన పడి భారత్ సహా ఏడూ దేశాల్లో ఏటా 13 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు తాజా అధ్యయనంలో తెలిసింది. ద లాన్సెట్స్ అనే ప్రముఖ వైద్య దిన పత్రికలో ప్రచురితమయ్యాయి.ప్రపంచ వ్యాప్తంగా ఏటా సంభవిస్తున్న క్యాన్సర్ మరణాల్లో సగానికి పైగా ... భారత్, చైనా, రష్యా, అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాల్లోనే సంభవిస్తున్నాయని ఈ కథనం తెలిపింది. ధూమపానం, మద్య పానం, ఊబకాయంతో పాటు హ్యూమన్ పాపిలోమా వైరస్ ఇన్ఫెక్షన్లు వంటి వాటి వాళ్ళ ఏడాదికి 20 లక్షల మందికి పైగా బలవుతున్నట్లు వివరించింది. ఇవన్నీ కూడా నివారించదగ్గ కారణాలేనని పేర్కొంది. వీటితో బలవుతున్న అకాల మరణాల వాళ్ళ ఏటా 3 కోట్ల ఏళ్ల జీవన కాలానికి దండి పడుతున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఒక్క ధూమపానం వల్లే 2. కోట్ల సంవత్సరాల జీవన కాలాన్ని ప్రజలు కోల్పోతున్నారని, ప్రపంచ వ్యాప్తంగా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ తో ప్రతీ రెండు నిమిషాలకు ఒకరు చప్పున చనిపోతున్నారు.

90 శాతం మరణాలు అల్ప, మధ్యాదాయ దేశాల్లోనే సంభవిస్తున్నాయి. సమగ్ర స్క్రీనింగ్, హెసీపీవీ టీకా కార్యక్రమాలతో వీటిని బాగా తగ్గించవచ్చు.

భారత దేశంలో పురుషుల్లో తల, మీద క్యాన్సర్ తో ఎక్కువ మంది చనిపోతున్నారు. మహిళల్లో పునరుత్పత్తి వ్యవస్థల్లో సంభవించే క్యాన్సర్లతో ఎక్కువ జీవన కాలాన్ని నష్టపోతున్నారు.

అమెరికా, బ్రిటన్ వంటి దేశాలతో పోలిస్తే, భారత్ దక్షిణాఫ్రికాల్లో గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ తక్కువగా జరుగుతోంది.

---

**మాల్దీవులల్లోని భారత్ దళాలు వెళ్ళిపోవాలి -- అధ్యక్షుడు మయిజ్జు**



మాల్దీవుల నుంచి భారత్ దళాలు వెళ్లి పోవాలని, తాము పూర్తి స్వతంత్రంగా ఉండాలని భావిస్తున్నట్లు ఆ దేశ నూతన అధ్యక్షుడు మహ్మద్ మయిజ్జు మరోసారి కోరడమే కాక, ఆ దెస అధ్యక్షా కార్యాలయం ఓ ప్రకటన కూడా విడుదల చేసింది. అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన ఒక రోజు వ్యవధి-

లోనే ఈ ప్రకటన వెలువడింది. చిన్న దీవుల సమూహంగా మాల్దీవులపై పట్టు కోసం భారత్, చైనా పోటీ పడుతున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన రోజునే తన ఆలోచనని బయట పెట్టడం గమనించ వలసిన విషయం.

ఈ ప్రకటనకు ముందే ప్రమాణ స్వీకారానికి వచ్చిన భారత భూ విజ్ఞాన శాస్త్ర శాఖ మంత్రి కిరణ్ రిజిజుతో మయిజ్జు ... ఈ అంశంపై చర్చించినట్లు మాల్దీవుల అధ్యక్ష కార్యాలయం పేర్కొంది. భారత్ కు చెందిన దాదాపు 70 మంది తో కూడిన సైన్యం ప్రస్తుతం అక్కడ ఉంటోంది. భారత్ సహకారంతో ఏర్పాటు చేసిన రాడార్ స్టేషన్లు, నిఘా విమానాల నిర్వహణ బాధ్యతలను చూస్తోంది. భారత యుద్ధ నౌకలు మాల్దీవుల ప్రత్యేక ఆర్థిక జోన్ లో గస్తీకి సహకరిస్తాయి. తాను అధికారం లోకి వస్తే మాల్దీవుల్లోని భారత్ బలగాలను వెనక్కి పంపిస్తానని మాయజ్జు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో ఇతర దేశాల సైనికులెవ్వరూ ఉండద్దు అంటూ పరోక్షంగా భారత్ ను ఉద్దేశించి అన్నారు.

---

భాజపాకు కుటుంబ పాలనకు మధ్య ఈ ఎన్నికలు --జేపీ నడ్డా



ఈ ఎన్నికలు కుటుంబ పార్టీలకు, భాజపా కు మధ్య జరుగుతున్నాయని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాల్లో లాగానే తెలంగాణాలో కూడా కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతోందని అన్నారు. నారాయణపేటలో నిర్వహించిన భాజపా సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా అభివృద్ధి కోసం ప్రధాని మోడీ నిధులు మంజూరు చేస్తుంటే, కేసీఆర్ కుటుంబం కోసం దుర్వినియోగం చేస్తూ, ప్రజలకు చేరనీయడం లేదు. అలాగే పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ ను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తోంటే, ఆ ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్ కు ఏటీఎం లా మారింది. రూ 1. లక్షలతో నిర్మించిన ఆ ప్రాజెక్టు లోని ఓ బ్రిడ్జి ఇటీవల కుంగిపోయింది. భాజపా అధికారంలోకి రాగానే కేసీఆర్ అవినీతిపై విచారణ జరిపి, జైలుకు పంపిస్తాం. వచ్చే ఎన్నికలు తెలంగాణా భవిష్యత్తును నిర్ధారించే ఎన్నికలు. కేంద్రంలో మోడీ చెప్పిన పనులన్నీ చేశారు. తెలంగాణలో ఏ పథకాలు అమలు కావడం లేదు. ఒక్క గ్యారంటీ కూడా అమలు చేయలేదు. ఇక్కడ కూడా 6 గ్యారెంటీ ఇస్తామని ఆ పార్టీ చెబుతోంది. వాటిని నమ్మొద్దు అని జేపీ నడ్డా చెప్పారు.

# బ్రహ్మఖండం

డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ



వేదవ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాలలో స్కాంద పురాణం ఒకటి. ఎనభైఎనిమిది వేల ఒక వంద శ్లోకములతో కూడిన ఈ పురాణం పురాణాలలోకెల్లా అతి పెద్దది.
ఈ పురాణం మహేశ్వర, వైష్ణవ, బ్రహ్మ, కాశీ, అవంత్య, నగర మరియు ప్రభాస అనే ఏడు (7) ఖండాలుగా విభజింపబడింది. అందులో మూడవ భాగమైన 'బ్రహ్మ ఖండం' మూడు ఉపఖండాలుగా విభజింపబడింది.
ఇదివరలో మన చైతన్యం సంకల్పబలం పత్రికా పాఠకులకు 'కాశీ ఖండం' అందించిన ప్రముఖ రచయిత శ్రీ పోచనపెద్ది వేంకట మురళీకృష్ణ గారు ఇప్పుడు 'బ్రహ్మఖండం' సమర్పిస్తున్నారు.
పాఠకులు ఈ పురాణ పఠన సదవకాశాన్ని వినియోగించుకుని ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాము.

-ఎడిటర్

3. వ.అధ్యాయం.

చక్రతీర్థ మహిమ.

" మహర్షీ! మీరు చెప్పిన ఇరవై నాలుగు తీర్థాలలో చక్రతీర్థ ప్రాధాన్యం ఏమిటి? దానికి ఆ పేరు ఎలా వచ్చింది. తెలియ పరచండి " అని ఋషులు ప్రార్థించారు.సూతుడు ఈ విధంగా చెప్పాడు.

తీర్థములన్నిటిలోను చక్రతీర్థము ప్రధానమైనది. ఈ తీర్థమును స్మరించడం వలన పునర్జన్మ ఉండదు. లక్ష జన్మలలో చేసిన పాపాలు నశిస్తాయి. సేతువు పేరును స్మరించినా, స్నానం చేసినా, కీర్తించినా, సమస్త పాపాలు నశిస్తాయి. ఈ తీర్థంతో సమానమైన తీర్థం మరొకటి లేదు. గంగ, సరస్వతి, రేవ ,మొదలయిన నదుల కన్న చక్రతీర్థం మిన్న.చక్ర తీర్థాన్ని ధర్మ తీర్థం అని పిలుస్తారు.

సేతువుయొక్క మూలాన్ని దర్భ శయనం అంటారు. దర్భశయనం దగ్గర చక్రతీర్థం ఉంది., విష్ణు భక్తుడైన గాలవుడు ధర్మ పుష్కరిణి తీర్థం దగ్గర తపస్సు చేసాడు. కొంతకాలం ఆకులు తింటూ, కొంతకాలం వాయువును భుజిస్తూ, అనేక విధాలుగా ఐదువేల సంవత్సరాలు తపస్సు చేసాడు. జనార్ధనుని ధ్యానిస్తూ తేజస్సంపన్నుడై తపస్సు చేసాడు. కొంత కాలానికి దేవదేవుడైన శ్రీ హరి లక్ష్మీ సహితుడై గాలవుని ఎదుట ప్రత్యక్ష మయ్యాడు. మహా భక్తితో గాలవుడు లక్ష్మీ నారాయణుని ఈ విధంగా స్తుతించాడు.

గాలవుడు జగన్నాధుని స్తుతించుట------------

నమో దేవాది దేవాయ శంఖ చక్ర గదా భృతే

నమో నిత్యాయ శుద్ధాయ సచ్చిదానంద రూపిణే

నమో భక్తార్తి హంత్రే తే హవ్యకవ్య స్వరూపిణే

నమ స్త్రిమూర్తయే తుభ్యం సృష్టి స్థిత్యంత కారిణే

నమః పరేశాయ నమో విభూమ్నే

నమోస్తు& లక్ష్మీ పతయే విధాత్రే

నమోస్తస్తు సూర్యేందు విలోచ నాయ

నమో విరించ్యాద్యభి వందితాయ

యో నామ జాత్యాది వికల్ప హీనః

సమస్త దోషైరపి వర్జితో యః

సమస్త సంసార భయాప హారిణే

తస్మై నమో దైత్య వినాశనాయ.

వేదాంత వేద్యాయ రమేశ్వరాయ

వైకుంఠ వాసాయ విధాతృపిత్రే

నమో నమః సద్య జనార్తి హారిణే

నారాయణాయా &మిత విక్రమా య

నమస్తుభ్యం భగవతే వాసుదేవా య శార్ జ్ఞిణే

భూయో భూయో నమస్తుభ్యం శేషపర్యంకసాయినే.(31-36)

శంఖము చక్రము గద ధరించిన దేవాది దేవునకు నమస్కారము. నిత్యునకు, శుద్ధునకు, సచ్చిదానంద రూపునకు హవ్య కవ్య స్వరూపునకు, త్రిమూర్తి స్వరూపునకు, సృష్టి స్థితి సంహార కారకునకు, అందరికి ప్రభుపైన నీకు నమస్కారం. విశేష స్థలములయందు నివసించు నీకు నమస్కారము. లక్ష్మీ పతీ! సూర్య చంద్రులు నేత్రములుగా కలవాడా!బ్రహ్మాది దేవతలతో సమానముగా నమస్కరింపబడు వాడా! వికల్పములు లేని వాడా! దోష రహితుడా! సంసార భయాన్ని పోగొట్టేవాడా! దైత్య నాశకుడా! వేదాంత వేద్యా! రామేశ్వరా! వైకుంఠ నివాసా! బ్రహ్మకు తండ్రి అయిన వాడా! జనుల బాధను పోగొట్టే వాడా! అమిత విక్రముడా! శార్ జ్ఞిణే! శేష శయనా ! నీకు నమస్కారం అని గాలవుడు విష్ణువును స్తుతించాడు. విష్ణువు ఆనందించి, నాలుగు చేతులతో కౌగలించుకొన్నాడు. " గాలవా! నీ తపస్సుకు మెచ్చుకున్నాను. నీకు కావలసిన వరాన్ని కోరుకో" అని విష్ణువు ఆదేశించాడు. " జనార్ధనా! నేను కృతార్ధుడను అయ్యాను. గొప్ప వాడిని అయ్యాను. అధర్మ పరులు నిన్ను చూడలేరు. బ్రహ్మ, వేదాలు, తెలుసుకో లేని నిన్ను నేను తెలుసుకొన్నాను. ఇంతకన్న నాకు వేరే వరం వద్దు. కర్మఠులు చూడలేని నిన్ను చూస్తున్నాను. నేను కృతార్ధుడ నయ్యాను. జనార్ధనుని నేను చూస్తున్నాను. నీ పాదాల మీద నిశ్చల భక్తి ఉండునట్లు చూడు. " అని గాలవుడు ప్రార్ధించాడు.

" ఓ మునీ! నీవు ఈ ఆశ్రమంలోనే ఉండు.ఈ ధర్మ పుష్కరిణి తీరంలో తపస్సు చేస్తూ ఉండు. పూర్వం ఈ ప్రాతంలో " ధర్ముడు" అను మహర్షి మహాదేవుడిని స్మరిస్తూ తపస్సు చేసాడు. ధర్ముని తపస్సు మెచ్చుకొని పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు ధర్ముడు శివుని ఈ విధంగా స్తుతించాడు.

ధర్ముడు శివుని స్తుతించుట

ప్రణమామి జగన్నాధ మీశానం ప్రణవాత్మకం

సమస్త దేవతారూపమాది మధ్యాంత వర్జితం

ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపం నమామ్యహం

సమస్త జగదాధారం అనన్త మజమవ్యయం

యమామనంతి యోగీంద్రాః తం వందే పుష్టి వర్ధనం

నమోలోకాధి నాధాయ వంచతే పరివంచతే

నమోస్తు నీల కంఠాయ పశూనాం పతయే నమః

నమః కల్మష నాశాయ నమో మీఢుష్టు మాయచ

నమో రుద్రాయ దేవాయ కద్రుద్రాయ ప్రచేతసే

నమః పినాక హస్తాయ శూలహస్తాయ తే నమః

నమః శ్చైతన్య రూపాయ పుష్టీనాం పతయే నమః

నమః పంచాస్య దేవాయ క్షేత్రాణాం పతయే నమః (55-60)

జగన్నాధుడా! ప్రణవ స్వరూపుడా! సమస్త దేవతా నీవు కోరినట్లుగా జగన్నాధుడా! ప్రణవ స్వరూపుడా! సమస్త దేవతా స్వరూపుడా!ఆదిమధ్యాంతవాసా!ఊర్ధ్వ రేతస్సు కలవాడవు. విరూపాక్షుడవు, విశ్వరూపుడవు, సమస్త జగదా ధారుడవు, అనంతుడవు, పుట్టుక లేని వాడవు, నాశనము లేని వాడవు, పుష్టి వర్ధనా, లోకాధి నాధా, చైతన్య రూపాయ, నీలకంఠా, పశుపతి. కల్మషము నశింప చేయువాడా! రుద్రునకు,ప్రచేసునకు నమస్కారం. పినాక ధనువు ధరింఉచిన వాడా! శూలము హస్తమున ధరించిన వాడా! చైతన్య స్వరూపా! పుష్టులకు పతియైన వాడా! ఐదు ముఖాలు కల వాడా! క్షేత్రములకు పతి యైన వాడా! నమ స్కారము " అని ధర్ముడు శంకరుని స్తుతించాడు. శివుడు సంతోషించి " ఓ ధర్మా! నీ స్తోత్రానికి సంతోషించాను.నీకు కావలసిన వరాన్ని కోరుకో" అని అనుజ్ఞ ఇచ్చాడు. " పార్వతీ పతీ! నేను ఎల్లప్పుడు నీకు వాహనంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని ధర్ముడు ప్రార్ధించాడు." ఓ ధర్మా! నీవు కోరినట్లుగా నాకు వాహనంగా ఉండు. నిన్ను సేవించిన వారికి నాయందు ఎల్లప్పుడు భక్తి ఉంటుంది" అని పరమేశ్వరుడు వరాన్ని ప్రసాదించాడు. ఆ నాటి నుండి ధర్ముడు నంది వాహనుడై పార్వతి పరమేశ్వరుల దగ్గర ఉన్నాడు.

ధర్ముడు తపస్సు చేసిన ప్రదేశాన్ని " ధర్మ తీర్థంగా" పరమేశ్వరుడు ఏర్పాటు చేసాడు. ఈ తీర్థంలో తపస్సు, జపము , స్వాధ్యాయం, చేసినచో ఇతర ధర్మ కార్యాలు చేయనక్కర లేదు. శివుడు నంది వాహనాన్ని అధిరోహించి , కైలాసం వెళ్ళిపోయాడు. " ఓ గాలవా! ఈ ధర్మ తీర్థంలో నీవు జీవించి ఉన్నంతకాలం తపస్సు చేయి. నన్ను చేరుకుంటావు. నీకు భయం కలిగినప్పుడు నన్ను తలచుకో చక్రాయుధాన్ని ప్రయోగించి నీ భయాన్ని పోగొడతాను " అని చెప్పి విష్ణువు అంతర్ధానమయ్యాడు.

గాలవుడు ధర్మ పుష్కరణి తీర్థంలో విష్ణువును పూజిస్తూ ఉన్నాడు. ఒక సారి మాఘ మాసంలో శుక్ల పక్షం హరి వాసరం( ఏకాదశి ) రోజున ఉపవాసముండి, జాగరణ చేసి, రాత్రి విష్ణువును పూజించాడు. మరుసటి రోజు ద్వాదశి నాడు స్నానం చేసి, సంధ్యా వందనాది నిత్య కర్మలు ఆచరించి, పూలతో ఉన్న తులసి మొక్క తీసుకు వచ్చి, పూజించి ,విష్ణువును ఈ విధంగా ప్రార్ధించాడు.

గాలవ కృత విష్ణు స్తుతి:----------------

సహస్ర శిరసం విష్ణుం మత్స్య రూప ధరం హరిం.

నమస్యామి హృషీకేశం కూర్మ వారాహ రూపిణం

నారసింహ వామనాఖ్యం జామదగ్న్యంచ రాఘవం

బలభద్రంచ కృష్ణంచ కల్కిం విష్ణుం నమామ్యహం

వాసుదేవ మనాధారం ప్రణతార్తి వినాశం

ఆధారం సర్వ భూతానాం ప్రణమామి జనార్దనం

సర్వజ్ఞం సర్వ కర్తారం సచ్చిదానంద విగ్రహం

అప్రతర్క్య మనిర్దేశ్యం ప్రణతోస్మి జనార్దనం(81-84)

సహస్ర శిరస్సులు కలవాడా!మత్స్య రూపా ! నారసింహా ! వామన రూపా ! పరశురామా! రామా! బలరామా! కృష్ణా ! కల్కి రూపా నీకు నమస్కరము. ఆధారము అవసరము లేని వాడవు, ఇతరుల బాధలను పోగొట్టే వాడివి, ప్రాణులన్నిటికి ఆధారమైన వాడవు, సర్వజ్ఞుడవు, అన్నింటికి కర్త అయిన వాడవు, సత్ చిత్ ఆనందస్వరూపుడవు, ఊహలకు అందని వాడవు, నిర్దేశించుటకు వీలుకాని వాడవు. జనార్దనా నీకు నమస్కారము" అని గాలవుడు విష్ణువును ప్రార్ధించాడు.

ఈ విధంగా గాలవుడు ప్రార్ధిస్తూ ఉండగా ఒక రాక్షసుడు ఆకలితో బాధపడుతూ, గాలవునితినాలని గ పట్టు కొన్నాడు. " నారాయణా! నారాయణా! రక్షించు,రక్షించు " అని గాలవుడు మొరపెట్టుకున్నాడు. దయాసముద్రుడయిన నారాయణుడు చక్రాన్ని విడిచిపెట్టాడు. అ విష్ణు చక్రం వేగంగా ధర్మ పుష్కరిణి తీరానికి వచ్చింది. సుదర్శ చక్రాన్ని చూసి రాక్షసుడు పరుగెత్తాడు. ఆ చక్రము రాక్షసుని వెంటాడి శిరస్సును ఖండించింది. సుదర్శ చక్రం భూమిమీద పడింది. సుదర్శన చక్రాన్ని గాలవుడు ఈ విధంగా స్తుతించాడు.

గాలవుడు సుదర్శన చక్రాన్ని స్తుతించుట :----------------

విష్ణుచక్ర నమస్తే2స్తు విశ్వరక్షణ దీక్షిత

నారాయణ కరాంభోజ భూషణాయ నమోస్తుతే

యుద్ధేష్వసుర సంహార కుశలాయ మహారవ

సుదర్శన నమస్తుభ్యం భక్తానామార్తి నాశినే

రక్షమాం భయ మసంవిగ్నం సర్వస్మాదవి కల్మషాత్

స్వామిన్ సుదర్శన విభో ధర్మతీర్థే సదాభవాన్

సంనిదేహి హితాయ త్వం జగతో ముక్తి కాంక్షిణః

గాలవే నైవ ముక్తంత ద్వి ష్ణు చక్రం మునీశ్వరాః( 98-101)

ఓ విష్ణు చక్రమా! నీకు నమస్కారం. ప్రపంచాన్ని రక్షించడానికి సిద్ధపడిన చక్రమా నారాయణుని చేతికి ఆభరణమైనదానా నీకు నమస్కారం. రాక్షసులను సంహరించిటకు సమర్థ మైనది. భక్తుల

(26 వ పేజీ చూడండి)

# చంద్ర మోహన్

**తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం**
**సీనియర్ నటుడు చంద్ర మోహన్ కన్నుమూత**

చంద్ర మోహన్ కృష్ణా జిల్లాకు చెందిన మామిడి ముక్కల గ్రామంలో 1945, మే 23న మల్లంపల్లి వీర భద్ర శాస్త్రి శాంభవి దంపతులకు జన్మించారు. ఆయన అసలు పేరు మల్లంపల్లి చంద్ర శేఖర్ రావు. వీరు వ్యవసాయ కళాశాల బాపట్లలో బి. యస్. సి. పూర్తి చేసి కొంతకాలం ఏలూరులో పని చేశారు. సినిమాలలో పనిచేయాలనే ఉత్సాహంతో మద్రాసు చేరి ప్రయత్నించారు. 1966 లో రంగుల రాట్నం సినిమాతో హీరోగా మొదలు పెట్టి, హాస్య నటుడిగా మారి తర్వాత కాలంలో క్యారెక్టర్ నటుడిగా చిత్రసీమలో స్థిరపడ్డారు.



చంద్రమోహన్ నటించిన కొన్ని చిత్రాలు సుఖ దుఃఖాలు , పదహారేళ్ళ వయసు, సిరి సిరి మువ్వ మొదలైనవి హిట్ కొట్టాయి. ఆ కాలం లో వీరితో ఎందరో కథానాయికలు నటించి, అగ్రస్థానాన్ని చేరుకున్నారు. శ్రీదేవి, మంజుల, రాధిక, జయప్రద, జయసుధ మొదలైన వారు ఈ కోవకు చెందినవారు.

ఈయన భార్య జలంధర, రచయిత్రి .. కథా సంకలనాలను వెలువరించింది.

వీరు 1978 లో పదహారేళ్ళ వయసు సినిమా కోసం ఉత్తమ నటుడిగా ఫిలింఫేర్ పురస్కారం,
2005 లో అతనొక్కడే సినిమాకు ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా నంది పురస్కారం,
2021 లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి గుర్తింపు,
మొట్టమొదటి సారిగా 14 దేశాల నుండి రచయితలూ 108 చంద్ర మోహన్ గారు నటించిన చిత్ర విశ్లేషణ.
దాదాపు 900 ల సినిమాలలో నటించారు చంద్రమోహన్.

అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2023 నవంబర్ 11న దీపావళికి ఒక రోజు ముందు చిత్ర సీమను దుఃఖ సాగరంలో ముంచారు. ప్రజల ఆదరణ పొందిన చంద్రమోహన్ గారి ఆత్మకు శాంతి కలగాలని చైతన్యం సంకల్పబలం కోరుకుంటోంది.

# ప్రకృతి

పొన్నపల్లి కామేశ్వరి

ప్రకృతి పరమాత్మ ప్రతిరూపం... విగ్రహానికి అలదిన
చందనం...
అవని పైని పచ్చదనం తరువుల శ్రేణి
తులసీ మాల...
గగనం ముత్యాల ఛత్రం....
శిఖరాలన్నీ మకరతోరణాలు..

ప్రకృతియే ప్రత్యక్ష దైవం..
అసూయలను అంతం చేసి ..
ద్వేషాలను తరిమి కొట్టి...
స్వార్ధం లేని ప్రకృతిలా..
తారతమ్యం ఎరుగని
పంచ భూతాలులా...
సుగంధ పుష్పాలు...
మకరంద ఫలాలు...
స్వచ్ఛమైన జలం..
చల్లని గాలి...మాత్రమే ఆస్వాదించ గలిగే...
గుండె సవ్వడి గంటలుగా మోగుతుంటే...
హారతి ఇస్తున్న మనసు..

భాస్కరుని నమస్కరిస్తూ స్వాగతిస్తూ...
వేకువవేళ అభయమిచ్చి అనుగ్రహించ మని
వేడుతూ.

---

# బ్రహ్మ ఖండం

(24 వ పేజీ తరువాయి)

ఆర్తిని నశింపచేయునది. భయంతో ఉన్న నా పాపాలనుండి రక్షించు. సుదర్శన చక్రమా! ఈ ధర్మ తీర్థమందు ఎల్లప్పుడు ఉండు. ముక్తిని ప్రసాదించు. “ అని గాలవుడు ప్రార్థించాడు. “ ఓ గాలవా! ఇది పుణ్యకరమైన ధర్మతీర్థం. ఈ తీర్థంలో నేను ఎల్లప్పుడు ఉంటాను. ఈ రాక్షసుని నేను చంపాను. ఈ తీర్థంలో ఉన్నవారికి భూతాలనుండి, రాక్షసులనుండి, పీడ ఉండదు. ధర్మ పుష్కరిణి అన్ని పాపాలను నశింప చేస్తుంది. ఇక్కడ నేను ఉండడం వలన చక్రతీర్థం అని పిలుస్తారు.” అని సుదర్శన చక్రం చెప్పి. ఆ తీర్థంలో ప్రవేశించింది.

చక్రతీర్థం వంటి తీర్థం మరొకటి లేదు. ఇక్కడ స్నానం చేసిన బ్రాహ్మణులు ముక్తిని పొందుతారు. ఈ అధ్యాయం చదివినా, ఏకాగ్రతతో విన్నా, చక్రతీర్థంలో అభిషేకం చేసిన పుణ్యాన్ని పొందుతారు. ఇహ లోకంలో సుఖాలను పొంది, పరలోకంలో సుఖం పొందుతారు. ఈ కథను స్మరించిన వారి పాపాలు నశిస్తాయి.

**స్కాంద పురాణంలోని “ బ్రహ్మ ఖండమందు” సేతు మాహాత్మ్యంలో “ధర్మ తీర్థం, చక్రతీర్థ మాహాత్మ్యం” అను మూడవ అధ్యాయం సమాప్తం.**

# అనుభవపాఠాలు



ఎలెక్ట్రాన్

శంకరం విజయవాడలో ఒక సాంకేతిక కళాశాల విద్యార్థులకు 'కృత్రిమ మేధ' అనే అంశం మీద ఓ వారం రోజులపాటు సందర్భోపన్యాసకుడిగా పాఠాలు చెప్పడానికి సతీసమేతంగా బయలుదేరి వెళ్ళాడు. శంకరం ఒక ప్రముఖ సమాచార సాంకేతికసంస్థలో పదవీ విరమణానంతరం, ఇలా వివిధ సాంకేతిక కళాశాలల్లో వారి వారి అభ్యర్థనల మీద, పాఠ్యప్రణాళికలో నిర్దేశితమైన ఏదైనా ఒక సాంకేతిక అంశంమీద వారం రోజులు ఉపన్యాసాలిచ్చి, పూర్తిచేసి, ఆయా కళాశాలల యాజమాన్యాలు వారి స్థాయి మేరకు ఇచ్చిన తాంబూలాలు ఆనందంగా స్వీకరించి, తిరిగి తన స్వగ్రామమైన మల్లేపల్లి వెళ్లిపోవడం ఓ అలవాటుగా మారింది. ఆ వచ్చిన ఆదాయాన్ని తన గ్రామంలో నిర్వహించబడే వేదపాఠశాలకు విరాళంగా యిచ్చేసేవాడు. ఏడాదిపాటు కాలంలో అంచెలంచెలుగా పూర్తిచేయాల్సిన క్లిష్టమైన పాఠ్యప్రణాళికను వారంరోజుల ఏకధారా ఉపన్యాసాలతో పూర్తిచేయించి, యాజమాన్యం తమ విధి నిర్వహించినందుకు గర్వించినా, 'విద్యార్థులెంత అవగాహన చేసుకొంటారు, వారికెంత న్యాయం జరుగుతోంది?', అని యాజమాన్యాలు ఆలోచించటల్లేదు. మొక్కుబడి సత్యనారాయణ వ్రతాల్లా, వేంకటేశ్వర దీపారాధనల్లా కొనసాగే ఈ విద్యావిధానం శంకరానికి ఇష్టం లేదు. అయినా మౌలికంగా మల్లేపల్లి వేదపాఠశాల అభివృద్ధికోసం కొంత మథనపడ్డ తర్వాతనే, శంకరం ఇలా ఉపన్యాసాలివ్వడానికి ఒప్పుకొన్నాడు.



అయితే పాఠాలు చెప్పడానికి వెళ్లినప్పుడు, ఇతరత్రా వివిధ కోణావృతమైన ఎన్నో జీవితానుభవాలు గడించి, మానవ ప్రవృత్తులను అంచనా వెయ్యడానికి ప్రయత్నించి తలగోక్కునే వాడు.

ఈ పర్యటనలో ఆ ఆదివారం సాయంత్రం నాలుగ్గంటలకి విజయవాడ రైల్వే స్టేషన్ లో



దిగిన శంకరం దంపతులను సాంకేతిక కళాశాల దిగువ స్థాయి ఉపన్యాసకుడు రామేశం అనే ఆయన స్వాగతించి, కళాశాల అతిథి గృహానికి తీసుకువెళ్లి దింపాడు.

"సర్! ఈ అతిథి గృహంలో వంటావార్పు లేవీ ఉండవు. శర్మ అనే ఈ యువకుడు ఈ అతిథి గృహాన్ని అంటిపెట్టుకొని ఉంటాడు. కాఫీ, టీలు మట్టుకు ఇతను చేస్తాడు. ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న దుర్గావిలాస్ కాఫీ హోటలుతో కళాశాలవారికి ఒప్పందం ఉంది. వారి మెన్యూ కార్డు ప్రతి గదిలోనూ ఉంటుంది. మీకు టిఫిన్లూ, భోజనం అవీ ఏం కావల్సినా ఇతనితో చెబ్తే, హోటలుకి ఫోన్ చేస్తాడు. హోటలు తాలూకు మనిషి వాటిని తీసుకు వస్తాడు. హోటలు మనిషి తీసుకొచ్చిన బిల్ వెనక మీరు, రూమ్ నెంబరు వ్రాసి, సంతకం చేసి ఇచ్చేస్తే చాలు. పేమెంట్ విషయం కాలేజీ చూసుకొంటుంది. సర్! నేను ట్యుటోరియల్ క్లాసు తీసుకోవాలి, ఇప్పటికే పదిహేను నిముషాలు ఆలశ్యమైపోయింది. వస్తాను మరి," అని చెప్పి వెళ్లిపోయాడు.

"సర్ మీరు స్నానం అవీ చేసి సేద తీరండి. మెన్యూ కార్డ్ మీద నా సెల్ నెంబరు ఉంది. నాకు రింగ్ చేసి కాఫీ కానీ, టీ కానీ ఏది తెమ్మంటే దాన్ని వేడివేడిగా తీసుకు వస్తాను," అని శర్మ వెళ్లిపోయాడు.

శంకరం ఏ.సి. స్విచ్ వేశాడు. కరెంటు ఉన్నా, ఏ.సి. పనిచెయ్యలేదు. దంపతులు స్నానాలు అవీ చేసి, పంకా వేసుకొని సోఫాలో కూర్చున్నారు. మహా వేడిగానూ, ఉక్కగానూ ఉంది. శంకరం శర్మకి ఫోన్ చేసి పంచదార లేకుండా కాఫీలు తెమ్మన్నాడు. పది నిముషాల్లో శర్మ ఒక ట్రే లో కాఫీ పాట్, రెండు కప్పులూ తీసుకు వచ్చాడు.

"ఏ.సి. పనిచెయ్యటల్లేదు!" అన్నాడు శంకరం.

"సర్! మీరు ముందర కాఫీ తాగండి. లేకపోతే చల్లారి పోతుంది. ఏ.సీ. సంగతి తర్వాత చెబ్తాను." అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఫిల్టర్ కాఫీ తాగగానే దంపతులిద్దరికీ ప్రాణం లేచివచ్చింది. "చాలా బావుంది. ఎక్కడ నేర్చావు?" అన్నాడు శంకరం.

"తమిళనాడు మధురైలో ఒక హోటల్లో రెండేళ్ళు పనిచేశా సర్!"

"నా శ్రీమతికి ఆ సులువేదో చెప్పి, చూపించు. నీకు ఋణపడి ఉంటాను! ఇంతకీ ఏసీ సంగతి మరి ?

"సర్! మిమ్మల్ని చూస్తోంటే అబద్ధమాడదల్చుకోలేదు. ఉన్న పది గదుల్లోనూ ఏ.సీ.లు ఉన్నాయి. కానీ ఏ ఒక్కటీ పనిచెయ్యటల్లేదు. ఏడాదినుంచీ ఇదే భాగవతం సర్! యాజమాన్యం

పట్టించుకోదు. మీరు ప్రిన్సిపాల్ గారికి ఫోన్ చేసి, ఏ గదిలోనూ ఏ.సి. పని చెయ్యటల్లేదనీ, చీకటి పడేలోగా బాగు చేయించమనీ, లేదా ఏదైనా హోటల్ కి మార్పించమనీ దబాయించి అడగండి. నేనిక్కడే



నిలబడి ఉంటాను. ఆయన నెంబరు మీ వద్ద ఉండే ఉంటుంది," అన్నాడు శర్మ.

శంకరం ప్రిన్సిపాల్ సదానందకి ఫోన్ చేసి, ఏసీ సంగతిని ఆంగ్లంలో మర్యాదగా చెప్పాడు. సదానంద చెప్పింది విని, శంకరం తన సెల్ఫోన్ శర్మకందించాడు మాట్లాడమన్నట్టుగా.

శర్మ సదానందం గారు చెప్పింది విని,"సర్! రూం నెంబరు పదకొండు కళాశాల యజమాని గారిది. అందులో ఫ్రిజ్ తో సహా అన్నీ పని చేస్తాయి. మిమ్మల్ని ఆ రూంలోకి మార్చమన్నారు. నేను వెళ్ళి దుప్పట్లూ అవీ మార్చి వస్తాను. ఆ లోపుగా మీరు తెరిచిన పెట్టెల్ని, విడిచిన బట్టల్ని సర్దుకోండి. అందులోకి మారిపోదురుకాని," అని శంకరం ఫోన్ వాపసు చేసి నిష్క్రమించాడు.

శంకరం దంపతులు గది మారి, విశ్రాంతి తీసుకొని, సాయంత్రం ఆరింటికి కళాశాల ప్రాంగణం వీడి బయటపడి, కృష్ణ ఒడ్డుకి వెడదామని పదడుగులు వేశారో లేదో, ఎదురుగా వస్తున్న ఓ భారీ శాల్తీ ఆగి, "శంకరం గారూ, ఏమిటిలా? మీరు క్లాసులు తీసుకోవడానికి వస్తున్నారని సదానందగారు చెప్పారు. విజయవాడని స్మార్ట్ సిటీగా మార్చడంతో కొన్ని సొబగులు దిద్దుకొంటోంది. యిరువైపుల కాలిబాటలకి వెనుకగా నిటారుగా పెరిగే నరమామిడి చెట్లు వేశారు. వాటి నీడ సంగతి దుర్గమ్మకి తెలిసినా, కూర్చోడానికి ప్రతి అయిదు మీటర్ల దూరంలోనూ ఒక సిమెంట్ సోఫా కట్టారు. కూర్చుందాం పదండి,"అని, దగ్గర్లోనే ఉన్న సోఫా మీద శంకరం దంపతుల్ని కూర్చోబెట్టి, తాను శంకరం పక్కన కూర్చున్నాడు.

శంకరం ఆ భారీ వ్యక్తిని భార్యకు పరిచయం చేశాడు. "ఈయన భూషణంగారని నేను ఉపన్యాసాలివ్వడానికి వచ్చిన ఈ కళాశాలలోనే పని చేస్తున్నారు. రెండుమూడు సార్లు నన్ను విశాఖలో కలుసుకొన్నారు.

"జ్ఞాపకం లేకనే. వీరినీ, మరో నలుగురినీ విశాఖలోమన క్వార్టర్ కి తీసుకు వచ్చారు కదా?" అంది శంకరం భార్య.

"వయసుతో మతిమరపు వచ్చేస్తోంది మరి!"అన్నాడు శంకరం నవ్వుతూ.

"సాయంత్రం షికారుకు బయలుదేరారా? కాస్త ముందుకు పోయి, ఎడమ చేతివైపు రోడ్డుకు పోతే కృష్ణ ఒడ్డు తగుల్తుంది.అక్కడకుపోయి కూర్చుంటే హాయిగా గాలి తగుల్తుంది, పదండి, అక్కడికి పోదాం," అన్నాడు భూషణం.

"కృష్ణ ఒడ్డుకు పోదామనే బయటకు వస్త. కాస్సేపు తిరిగి, అతిథిగృహం చేరి రేపటి క్లాసులకి కాస్త తయారవ్వాలి."

"సర్! అనుకోని అవకాశం. పదండి మా యింటికి పోదాం. ఇక్కడికి దగ్గరే! మా యింటి ఆతిథ్యం స్వీకరించి వెళ్ళండి," అని ఒకటికి రెండు సార్లు

భూషణం బలవంత పెట్టేయడంతో శంకరం తల ఊపాడు. భూషణం ఓ పదడుగులు వేసి ఆగి, భార్యకి ఫోన్ చేసి ఇద్దరు అతిథుల్ని తీసుకువస్తున్నట్లు చెప్పగానే, అవతలపక్కనుంచి భూషణం భార్య ఒక్కసారిగా విరుచుకు పడింది. భూషణం మౌనంగా వినవలసినదంతా విని, బిక్కమొహంతో శంకరం దంపతుల్ని సమీపించి, "సారీ సర్! శ్రీమతి పిన్నమ్మ కూతురితో కలిసి దుర్గ గుడికి వెళ్ళి, అక్కడ క్యూలో ఇరుక్కు పోయిందట. ఎప్పుడు తిరిగి రాగలదో చెప్పలేదు కాబట్టి, రేపు రాత్రి భోజనానికి మిమ్మల్ని తీసుకు రమ్మని చెప్పింది సర్! ఏమీ అనుకోవద్దు!" అని ప్రాధేయపడ్డాడు.



"అయ్యో, పర్వాలేదు సర్! బాధపడకండి. అలాగే రేపే వస్తాం లెండి. పదండి, ఏదైనా హోటలుకి పోయి మాతో అల్పాహారం తీసుకుందురుగాని," అని శంకరం అనడంతో, భూషణం స్థిమిత పడి వారిద్దర్నీ కృష్ణవిలాస్ కి తీసుకు పోయాడు. ముగ్గురూ ఆవిర్లు కక్కే ఇడ్లీలు, మినప రోస్టూ తిన్న తర్వాత, తమకు పంచదార లేకుండా రెండూ, భూషణంగారికి పంచదారతో ఒక కాఫీ తెమ్మని శంకరం, చెప్పాడు. టిప్ తో సహా శంకరం రెండు వందల యాభై బిల్ చెల్లించి, భూషణంకి శుభరాత్రి చెప్పి భార్యతో అతిథిగృహం చేరుకొన్నాడు. ఒక గంటసేపు కూడా తెచ్చుకొన్న రెండు మూడు పుస్తకాల్ని, కళాశాల వారిచ్చిన పాఠ్యప్రణాళికను చూస్తూ, ఒక చిన్న నోటు పుస్తకంలో ఓ పది ఏకవాక్య క్రమణికలు వ్రాసుకొని పడుకొన్నాడు. మర్నాడుదయమే శర్మ ఇచ్చిన కాఫీలు తాగి బావుందని మెచ్చుకొన్నారు. ఉపవాసభంగానికి యిడ్లీలు తెప్పించాడు. మధ్యాహ్న భోజనం కోసం హోటలుకి ఫోన్ చెయ్యమని శర్మకి చెప్పాడు. ఉదయంనుంచి మధ్యాహ్న విరామం వరకూ, అటుతర్వాత సాయంకాలం వరకూ మొత్తం ఆరు గంటలసేపు ఏకధాటి ఉపన్యాసాలిచ్చి, బయటపడ్తూన్న సమయంలో భూషణం వచ్చి అడ్డు పడ్డాడు. " సర్! రేపు సాయంత్రం మీరు మాయింటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించాలి. తప్పదు. నిన్న ఏదో దుర్గమ్మ తల్లి మా ఆవిణ్ణి కట్టి పడేయడంతో అలాగైపోయింది కానీ, ఏమీ అనుకోవద్దు. ఇవ్వాళ శ్రీమతి మరో అరుగురితో కలిసి ఊరగాయల ప్రోగ్రాంలో మునిగిపోయింది. రేపు నేను ఆరింటికల్లా వచ్చి మిమ్మల్ని తీసుకు వెడ్తాను," అని రెండోసారి బలవంత పెట్టి, అలాగేననిపించుకొని వెళ్ళాడు.

ఆ మర్నాడు శంకరం విద్యార్థుల ఏకాగ్రత గమనించి సంతసంగా అతిథి గృహం చేరుకొన్నాడు. ఆరింటికి అన్నట్టుగానే భూషణం వచ్చి శంకరం దంపతుల్ని తన ఇంటికి తీసుకుపోయాడు. ప్రిన్సిపాల్ సదానంద కూడా సతీసమేతంగా ఆహ్వానితుడై ఉన్నాడు. కాసేపు అవీ యివీ మాట్లాడిన తర్వాత అందరూ భోజనాలకి లేచారు. భూషణం భార్య పలకరింపుల్లో ఆప్యాయత లేదు.

అంతకు ముందే కేటరర్ తెచ్చిన

వంటకాల్ని అందమైన పాత్రల్లో ఉంచి డైనింగ్ టేబుల్ మీద అమర్చి సిద్ధంగా ఉంచింది. పాత్రలమీది మీద మూతలు తీసి, తానూ కూర్చుంది. భూషణం తళతళలాడే ఓ స్టీలు గిన్న మూత తెరిచి అందులోంచి బొబ్బట్లు ఒకటొకటిగా తీసి ముందస్తుగా సదానంద దంపతుల ముందునున్న చిన్న పళ్లేలలో ఉంచాడు. తర్వాత అదేవిధంగా చెయ్యబోతోంటే,"శంకరం దంపతులు పంచదార లేకుండా కాఫీలు తాగారని చెప్పారుగా. వారికి చక్కెరవ్యాధి ఉందేమోనని, రమ్యా గృహవంటకాల షాపునుంచి నాలుగే బొబ్బట్లు తీసుకురమ్మన్నాను!" అంది, హాస్యమాడుతున్నట్టుగా లేని నవ్వు తెచ్చుకొంటూ. "మంచిపనే చేశారు. లేకపోతే అనవసరంగా వృథా అయిపోయేవి!" అంది శంకరం భార్య. "ఈ గృహవంటకాలంటూ పేటకో షాపు వెలిసింది. బొబ్బట్లూ, అరిసెలూ అంటూ అమ్మే మిఠాయి దుకాణాలు వాటి పరువుని తీస్తున్నాయి. నాకు ఇంట్లో చేసుకొన్న బొబ్బట్లే బావుంటాయి! అయినా మీరు మా మీది అభిమానంతో తెచ్చిన బొబ్బట్లు తోనే భోజనం ప్రారంభిద్దాం," అంటూ సదానంద భార్య ఓ బొబ్బట్టు ముక్కని అతి ప్రయాసపడి తెంపి, నోట్లో వేసుకొంది. శంకరం దంపతులు వచ్చేనవ్వును అపుకొంటూ అన్నంలో ఏదో కలగలుపు పప్పును కలుపుకొన్నారు. సదానంద భార్య అవివేకానికి లోలోపల విసుక్కున్నాడు. భూషణం నిర్లిప్తంగా ఒక బొబ్బట్టు వేసుకొని, స్టీలు గిన్నెని భార్యవైపు తోశాడు. ఆమె బొబ్బట్టు వేసుకోకుండానే గిన్నెమీద మూత పెట్టింది. వారం రోజుల క్లాసులు ముగిసిన సాయంత్రం విద్యార్థులందరూ శంకరం దంపతులకి అల్పాహార విందు చేశారు. "శంకరం సర్! ముఖస్తుతి కాదుకాని, ఇంతవరకూ సంక్లిష్టమైన పాఠ్యాంశాలని చెప్పడానికి వచ్చిన సాంకేతిక నిపుణులలో మీలా అద్భుతంగా పాఠం చెప్పిన వారెవరూ లేరు. మీలాంటివారు ఏటి పొడుగు అంచెలంచెలుగా ఇదే పాఠ్యాంశాన్ని బోధిస్తే మరెంత బావుండేది సర్!'' తరగతి విద్యార్థి నాయకుడు చెప్పిన మాటలివి. సదానంద కిమ్మనకుండా ఉండిపోయాడు. విద్యార్థులు తెచ్చిన వేడివేడి జిలేబీని త్రీ ఇన్ ఒన్ ఐస్ క్రీమ్ తో హాయిగా తింటూన్న శంకరం దంపతుల్ని చూసి భూషణం, సదానందంలు విస్తుబోయారు. కార్యక్రమం ముగిసిన తర్వాత భూషణం ఉండబట్టలేక చనువు తీసుకొని శంకరాన్ని అడిగేశాడు. "వాళ్ళు చందాలు వేసుకొని ఎంతో అప్యాయతతో అల్పాహార విందు ఏర్పాటుచేశారు. నాకేదో చక్కెరవ్యాధి ఉందన్న కారణంగా కాదనీ, వద్దనీ వారిని నిరుత్సాహపరచడం నాకు భావ్యం కాదు. అప్పుడప్పుడూ జిహ్వాచాపల్యాన్ని కూడా సంతృప్తి పరచడంలో అదోరకమైన సంతృప్తి కలుగుతుంది. అదే జిహ్వ- సంగతీ సందర్భం తెలియకుండా మాటల్ని జార్చినప్పుడు ఎదుటివారి నెత్తిమీద మీద వేడివేడి పరమాన్నాని పోసినట్లుంటుంది!" అన్నాడు శంకరం చిన్నగా నవ్వుతూ. "క్షమించండి సర్! నా భార్య మనస్తత్త్వం తెలిసుండీ మిమ్మల్ని భోజనాలకి పిలవడం నాదే పొరపాటు. మీరు పంచదార లేకుండా కాఫీ తాగుతారని నా భార్యతో చెప్పడం మరింత అవివేకం. వాస్తవానికి మీరొచ్చినరోజు సాయంత్రం నా భార్య ఇంట్లోనే ఉంది. గత్యంతరం లేక దుర్గ గుడి సందోహంలో ఇరుక్కుపోయిందని ఉందని నేనే అబద్ధమాడాను. నిన్న పెట్టిన కొత్తావకాయని తీసుకు రమ్మని చెబుదామనుకొని జరిగిన తంతు చూసి ఆ మాటనలేకపోయాను. దుర్గమ్మతల్లి నన్ను క్షమించినా, క్షమించకపోయినా మీరు మట్టుకు నన్ను మన్నించండి!" అంటూ భూషణం శంకరం చేతులు పట్టుకొన్నాడు. "ఏమీ పర్వాలేదు మాస్టారూ! తేలికగా తీసుకోండి!"అంటూ శంకరంభూషణంభుజంతట్టాడు.

మనిషి పిన్నవయసులోనే మాటలు నేర్చుకొంటాడు. కానీ ఎదుగుదలలో సంస్కారం లోపించినప్పుడు ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో మాట్లాడాలో తెలుసుకోవడానికి ఓ జీవిత కాలం సరిపోదు. అనుభవాలు నేర్పే పాఠాలకి ప్రణాళికలుండవు.

# కార్తీకదీపం - మంగళకరం సౌభాగ్య ప్రదం



**కొత్త రామానందం**

"దీపం సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపం" దీపం సకల సంపదలు ప్రసాదించే లక్ష్మీదేవి. దీపాన్ని జ్ఞానానికి చిహ్నంగా, ఐశ్వర్యానికి సంకేతంగా, సంపద, ఆనందాలకు ప్రతీకంగా అనాదికాలం నుంచి భావిస్తున్నాం. దీపాన్ని ఆరాధించడం వల్లనే మనకు భారతీయులు అనే పేరు ఏర్పడిరదని చెప్పబడుతుంది. 'భా' అంటే భారతి, 'రుతు' అంటే ఇష్టం అంటే దీపాన్ని లేదా కాంతిని ఇష్టపడేవారు. కనుక భారతీయులయ్యారని భావం. ఏ శుభకార్యారంభంలోనైనా దీప ప్రకాశనం చేయడం మన ఆచారం. అగ్నిసాక్షిగా పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామనే భావన దీపారాధనతో కలుగుతుంది. దీపాన్ని వెలిగించడమంటే మనలోని అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి జ్ఞాన కాంతిని ఆహ్వానించడమే అవుతుంది. దీపంలో కనిపించే నీలం, పసుపు, తెలుగు వర్ణాలు మనలోని సత్వరజ స్తమో గుణాలకు ప్రతీకలు. సత్యం, శివం, సుందరాలకు సంకేతాలవి.



దైవ పూజలోని షోడశోపచారాలలో దీపారాధన ప్రధానం. దీపమే దైవ స్వరూపం. దీక్షాకాలంలో విఘ్నాలు రాకుండా దీపం కాపాడుతుంది. దీప సన్నిధిలో చేసే ఏ సాధన అయినా శీఘ్రంగా ఫలిస్తుంది. దీపారాధన సర్వశ్రేయోధాయక ఫలితాలనిస్తుంది. సంధ్యా సమయాల్లో దీపం వెలుగుతున్న ఇంట్లో దైవశక్తులుంటాయి. ఆ ఇంట సకల శుభాలు సమకూరుతాయి.

దీపదో లభతే విద్యాం, దీపదో లభతే శ్రుతం।
దీపదో లభతే ఆయుః దీపదో లభతే దీపం॥

దీపం వల్ల వేద విద్య, ఆయుష్షు, స్వర్గము లభిస్తాయి. హైందవ సంప్రదాయంలో ప్రతి ఇంటా దీపారాధన సర్వసామాన్యం. దీపజ్యోతి వల్ల పాపాలు హరించి ఉత్తమ గతులు పొందుతారని ఒక నమ్మకం.



నిత్యం దీపాన్ని వెలిగించినా, ఆరాధించినా, దీపాన్ని కార్తీక మాసంలో వెలిగించడం, నదిలో దీపాలను కలుపడం, ఆకాశదీపాలను వెలిగించడం, దీప దానం చేయడం వంటి ఆచారాలను పాటించడం అత్యంత పుణ్యప్రదమైనదిగా పురాణాలు వెల్లడిస్తున్నాయి.

కార్తీక మాసంలో దీపాన్ని వెలిగించడం, దర్శించడం వల్ల పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది అంటారు. కార్తీక మాసమంతా ఇంటి ముందు ద్వారానికి ఇరువైపులా దీపాన్ని వెలిగించడం మన ఆచారం. అలాగే సాయంకాలం శివాలయాలలో కానీ, వైష్ణవాలయాలలోగానీ, గోపుర ద్వారం వద్ద, దేవుని సన్నిధిలో, ధ్వజ స్థంభం వద్ద, తులసి కోట వద్ద, ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించిన వారికి సకల సుఖాలు లభిస్తాయి. ఇతరులు వెలిగించిన దీపాన్ని ఆరిపోకుండా చేయటం ఉత్తమ ఫలితాలనిస్తుంది. శివాలయంలో ఉసిరికాయ పైన వత్తులు ఉంచి దీపాన్ని వెలిగించడం అత్యంత శ్రేష్ఠం. అరటి డొప్పలలో పూలు ఉంచి ఆపైన దీపాన్ని ఉంచి నదులలో వదలడం అలవాటు. క్షేత్ర దర్శనం తర్వాత నదీ దేవతకు దీపం వెలిగించి, హారతి ఇస్తే వరుణ లోక ప్రాప్తి లభిస్తుందంటారు.


దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం
సర్వ తమోపహమ్,
దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా
దీప నమోస్తుతే॥

అంటూ దీపాన్ని వెలిగించి అనంతరం దీపాన్ని స్తుతించడం మన ఆచారం. 'దామోదరం ఆవాహయామి', 'త్రయంబకం ఆవాహయామి' అంటూ కార్తీక దామోదరుణ్ణి త్రయంబకుడైన శివుణ్ణి దీప రూపంలోకి అవహన చేస్తూ దీపాన్ని వెలిగిస్తారు బ్రహ్మ, గణపతులు సైతం లక్ష్మీనారాయణుల్ని పూజించడానికి దీపాలని వెలిగించారని పద్మ పురాణం చెబుతుంది. కార్తీకంలోని నెల రోజులు ప్రాతఃకాలం, సంధ్యా సమయాల్లో దీపాన్ని వెలిగిస్తూ హరిహరుల్ని పూజించాలి. పురాణ శ్రవణంచేయాలి సాయం సమయాల్లో దీపాన్ని దర్శించగానే

దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం
జ్యోతి జనార్ధన:
దీపేన హారతే పాపం సంధ్యా
దీప నమోస్తుతే॥

అనే శ్లోకాన్ని పఠించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. దీపం జ్యోతి పరబ్రహ్మ స్వరూపం మనోవికాసానికి, ప్రశాంతతకి, సాధు ప్రకృతికి నిదర్శనం గా భావిస్తారు. సృష్టిని చైతన్యవంతం చేసే చైతన్య కిరణాలు దీప కాంతి నుంచే ప్రభవిస్తాయి.

మానవ శరీరం మట్టి ప్రమిద. ప్రాణం ప్రకాశించే దీపం ఆధ్యాత్మిక సాధన అందులో పోసే తైలం భగవంతుడికి చేసే షోడశోపచారాల్లో సమర్పణ ప్రధానమైనది. దీపం వేడిని భూమాత భరించలేదని ప్రమిదలో ప్రమిద వేసి మరీ దీపం వెలిగిస్తారు పద్య పురాణంలో దీప మహిమను వర్ణించారు.



దీప వైవిధ్యం:

దీపాలలో అనేక రూపాలు ఉన్నాయి దేని ప్రత్యేకత దానిదే. దేని ఫలితం దానిదే. అఖండ దీపం వెలిగించడమే దీప యజ్ఞం. కార్తీక మాసంలో దైవ మందిరానికి చేరువలో నెల రోజులు ఈ దీపానికి వలయు నెయ్యి లేదా నూనె మరియు ఒత్తులు సమకూరుస్తూ రోజూ ప్రణమిల్లాలి. కొందరు స్త్రీలు పిండితో చేసిన ప్రమిదలతో దీపాన్ని వెలిగిస్తారు. నాగుల జంట బొమ్మ ముందు పిండి దీపం వెలిగిస్తే సర్వ దోష నివారణ అవుతుంది. కొందరు మహిళలు ఆలయాల్లో నిమ్మ డొప్పలతో దీపాలు రాహు గ్రహ దోష నివారణ కోసం వెలిగిస్తారు. ఇక కార్తీకమాసం నెల రోజులు రాత్రి సమయాలలో ఆకాశదీపం వెలిగించడం ఆచారం. దీప కాంతి దర్శనంతో పుణ్య ఫలాలు ప్రాప్తించాలని ఉద్దేశంతో ఆకాశ దీపాలు వెలిగిస్తారు.

కార్తీక పౌర్ణమికి దీపారాధన అందరూ చేస్తారు. లోగిళ్ళలో, ఆలయాలన్నింటిలో ప్రమిదలలో ఆవు నేతి దీపాలను పెద్ద సంఖ్యలో వెలిగిస్తారు. ఈ రోజున శివాలయాల్లో జరిపే ఉత్సవం 'జ్వాలా తోరణం'. క్షీర సాగర మదన సమయంలో వెలువడిన హాలాహలం శివుడు మింగి లోకాలను కాపాడినప్పుడు అమ్మ పార్వతి దేవి నూనెతో తడిపిన వస్త్రాన్ని అంటించి ఆ నిప్పును పరమేశ్వరుడైన పతికి దిష్టి తీసింది. అదే జ్వాలా తోరణంగా వాడుకలోకి వచ్చింది. ప్రతి శివాలయంలో ముఖ్యంగా శ్రీశైలంలో భక్తులు సమక్షంలో జ్వాలలు వెలుగుతున్న సమయాన పల్లకిలో ఆదిదంపతులను ఉంచుకొని ముమ్మారు ప్రదక్షిణ పూర్వకంగా ఆలయ అర్చకులు వెళతారు. పల్లకితో పాటే జ్వాలాతోరణం దాటడానికి భక్తులు ఉత్సాహం చూపుతారు.

జ్వాలాతోరణపు భస్మాన్ని అందుకొని ధరించడానికి భక్తులు తహతహలాడుతారు. ప్రాప్తం ఉన్నవారికి ప్రాప్తం ఉన్నంత ఆ శివుని ప్రసాదం లభిస్తూ ఉంటుంది. జ్వాలా తోరణంలో పాల్గొంటే సమస్త దోషాలు నశిస్తాయి అని భక్తుల నమ్మకం.

కార్తీక పౌర్ణమి రోజున 360 వత్తులున్న గుత్తిని ఆవు నేతితో తడిపి దేవాలయాల్లో లేదా తులసీకోట వద్ద వెలిగించడం ఒక ఆచారంగా వస్తుంది. మనకున్న తిథులు 15, నెలకు 30 తిథులు, నెలలు మొత్తం 12, అనగా రోజుకు ఒకటి చొప్పున 360 వత్తులు సంవత్సరానికి సంకేతంగా నిలుస్తాయి. తడి బట్టలతో కాక ఉతికిన వస్త్రాలు ధరించి వత్తి తూర్పు వైపు ఉండేలా వెలిగిస్తే ఐశ్వర్యదాయకమంటారు. అలాగే ఈశాన్య దిక్కుకు తిప్పి వెలిగిస్తే లక్ష్మీ కటాక్షం ఋణ బాధలు నుండి విముక్తి లభిస్తాయి.



ప్రమిదలో బేధాలు:

దీపారాధనకు ప్రమిదలకు కూడా మన సాధనను అనుసరించి ఎన్నుకోవాలి. కంచు, ఇత్తడి ప్రమిదలలో వెలిగిస్తే శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయి. మట్టి, పింగాణి ప్రమిదలలో వెలిగిస్తే తలచిన కార్యాలు నెరవేరుతాయి. వెండి కుందులు సర్వశుభప్రదం. శుభకార్యాలలో రెండు వెండి కుందులు వాడటం మంచిది.

దీపారాధనకు ఆవు నెయ్యి ఉత్తమం. నువ్వుల నూనె మధ్యమం. ఇప్పనూనె అధమం అని చెప్పారు. ఆవు నెయ్యితో వెలిగించిన దీపం జ్ఞానదాయకం, మంచి నూనెతో దీపం వెలిగిస్తే సంపద కీర్తి లభిస్తాయంటారు. ఇప్ప నూనెతో దీపం వెలిగిస్తే ఇహ భోగం పొందటానికి, మిగతా నూనెలతో దీపాలు కామ్యార్థాలకు శత్రు నాశనానికి ఉపయోగిస్తారు.

వత్తిని బట్టి ఫలితం:

దీపారాధనకు శుద్ధమైన వత్తిని ఎంచుకోవాలి. తామర మాడులతో వత్తులు వెలిగిస్తే అఖండ భాగ్యం లభిస్తుంది. పితృ దోషాలు తొలగుతాయి. అరటి వత్తులతో వెలిగిస్తే ఉత్తమ సంతతి, జిల్లేడు వత్తులతో వెలిగిస్తే అపార సంపద లభిస్తుంది.పసుపు రంగు గుడ్డతో వత్తి చేసి వెలిగిస్తే దేవి కటాక్షం, కుంకుమ రంగు బట్ట వత్తితో వెలిగిస్తే సంతాన ప్రాప్తి కలుగుతుంది. పన్నీరుతో తడిపిన నేతి వత్తులతో వెలిగిస్తే కీర్తి వంతులౌవుతారు.

దీపదానం

కార్తీక మాసంలో దీపదానం అత్యంత పుణ్య ప్రదం. "ఏకస్పర్శ దానాని దీపదానం తదైకత:" అని శాస్త్ర వచనం అంటే అన్ని దానాలు ఒక ఎత్తు అయితే దీపదానం ఒక ఎత్తు అని అర్థం. షోడశ మహా దానాలలాంటివి ఎన్ని చేసినా అవి ఏవి దీపదానానికి సరికావు. అందుకే అన్ని

దానాలలో దీపదానాన్ని శ్రేష్టమైన దానమన్నారు. పైడిపత్తితో స్వయంగా ఒత్తులను తయారు చేసుకుని, వరి పిండితో కాని, గోధుమ పిండితో కాని ప్రమిదను తయారు చేసుకుని అందులో ఆవు నెయ్యి పోసి దీపాన్ని వెలిగించి దానికి నమస్కరించి కార్తీక సోమవారం నాడు గానీ, కార్తీక పౌర్ణమి పౌర్ణమి నాడు గానీ అలా కుదరనప్పుడు ఏదో ఒక రోజున నదీ తీరంలో కానీ, శివాలయంలో కానీ ఉత్తముడైన బ్రాహ్మణునికి దానమివ్వాలి. దీపదానం చేసే సమయంలో`

కీటా పతంగా: మశకాశ్చ వృక్షాః
జలేస్థలే యే నివసంతి జీవాః
దృష్ట్వా ప్రదీపం నచ జన్మ భాగినః
భవన్తి నిత్యం శ్వ పచాహి విప్రా:॥

అనే శ్లోకాన్ని పఠించాలి. శక్తియున్నవారు ఓ వెండి పళ్లెంలో లేదా రాగి పళ్ళెంలో బియ్యం పోసి మూడు వెండి కుందులను ఉంచాలి. దానిలో ఆవునెయ్యి దీపాలు వెలిగించాలి. మూడు దీపాలలోను దూదితో చేసిన వత్తులతో పాటు బంగారం లేక వెండితో చేసిన పుల్లలను దీపపు ఒత్తులుగా చేసి ఉంచాలి. ఆ మూడు వెండి ప్రమిదలు చుట్టూ ఏడు ఉసిరికాయలు ఉంచాలి. వాటిపై ఆవు నేతితో తడిపిన నిలువు వత్తులను వెలిగించాలి. రాగి వగైరాలకు బదులుగా దక్షిణ కూడా ఇవ్వవచ్చు.

దీపదానం స్వీకరించే వారి కాళ్లు కడిగి తిలకంతో అలంకరించాలి. సంకల్పం చెప్పి దక్షిణ పూర్వకంగా ఆ పళ్ళాన్ని దానం ఇవ్వాలి. దీపదానం బ్రాహ్మణులకే కాక ముత్తయిదువులకు కూడా ఇవ్వవచ్చు. స్వీకరించేవారు దొరకని పక్షంలో ఏదైనా ఆలయంలో స్వామి సన్నిధానంలో లేదా ధ్వజస్తంభం దగ్గర దీపాలు వెలిగించాలి.

దాన ఫలం:


దీప దానం చేసేటప్పుడు ఎన్ని వత్తులు వెలిగిస్తే, ఏ ఫలితం వస్తుందో శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. దీపంలో రెండు వత్తులు ఉంచి దానం చేస్తే శాంతి, మూడు వత్తులు ఉంచి దానం చేస్తే సమస్త పాప క్షయమై తేజస్వి, బుద్ధిమంతుడు అవుతాడు. నాలుగు వత్తులతో దీప దానం చేస్తే రాజవుతాడు. పది వత్తులతో దీప దానం చేస్తే చక్రవర్తి అవుతాడు. ఏబది వత్తులతో దానం చేస్తే దేవతలలో ఒకడౌతాడు. నూరు వత్తులతో దానం చేస్తే విష్ణురూపుడు అవుతాడు.

ఉసిరి దీపం గొప్పది. "వైరాగ్య తైల సంపూర్ణే భక్తివర్తి సమన్వితే" దీపం వెలిగించడానికి ఓ ప్రమిద కావాలి. అదే మానవ దేహం పృథివీ తత్వం. వైరాగ్యంతో కూడిన తైలం (నూనె) కావాలి. ఇది జలతత్వం. భక్తి అనే వత్తి అందులో ఉంచాలి.అది ఆకాశతత్వం. వెలిగించడానికి అగ్ని కావాలి, అది అగ్నితత్వం. వెలిగించిన తర్వాత ఆ దీపం అఖండంగా వెలగడానికి గాలి కావాలి, అది వాయు తత్వం. ఇలా పంచ తత్వాలతో ఊపిరి పోసే ఉసిరికను దీపశిఖకు ఆధారంగా చేస్తాం. దేహంపై మమకారం వదిలిపెట్టడానికి, అజ్ఞానం తొలిగి జ్ఞానం పొందడానికి కార్తీకదీప దానం చేస్తాం.

ఈ విధంగా కార్తీక మాసంలో దీపాన్ని వెలిగించడం, దీప దానం చేయడం వల్ల సకల జీవరాశులు ముక్తి పొందుతాయని శాస్త్రవచనం. అందుకు సంబరాసుని కథ పద్మ పురాణంలో ఉంది. కృతయుగంలో మాయాపురం

అనే గ్రామంలో దేవ వర్మ అని పండితుడు నివసిస్తూ ఉండేవాడు. ఆయన సూర్య-దేవుని భక్తుడు. ఆయనకు ఒకే కూతురు పుట్టగా గుణవతి అని పేరు పెట్టి అల్లారు ముద్దుగా పెంచుకో సాగాడు. తన ఏకైక పుత్రిక-ను చంద్రుడు అనే శిష్యుని-కిచ్చి వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నాడు. అందరూ కలిసి సంతోషంగా జీవిస్తూ దైవధ్యానం చేస్తూ ప్రశాంత జీ-వితాన్ని గడపసాగారు. ఇదిలా ఉండగా ఒకరోజు మామ అల్లుళ్ళిద్దరూ కట్టెల కోసం అడవికి వెళ్లగా ఒక రాక్షసుడి-ని బారినపడి మరణించారు. విషయం తెలిసిన గుణవతి దుఃఖించింది. తండ్రికి భర్తకు శ్రార్ధ కర్మలను జరిపించిం-ది. నిత్యం దైవ ప్రార్థనలు చేస్తూ, ఆధ్యాత్మికానందంలో జీవించ సాగింది. ఆమె ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో కార్తీక నియమాలను పాటిస్తూ దీపాలను వెలిగించుతూ దీప దానాలను శ్రద్ధగా నిర్వహించే-ది.

ఇలా కొన్నేళ్లు గడిచిన పిదప ఆమె కార్తీక మాసంలో ఒకరోజు నదిలో స్నానం చేస్తూ మరణించింది. అప్పు-



డొక దివ్య విమానం వచ్చి ఆమెను వైకుంఠానికి తీసు-కెళ్లగా శ్రీ మహావిష్ణువు, లక్ష్మీ-దేవి ఆమెకు స్వాగత సత్కారం చేసి ఉపచారాలు చేసారు. మరుజన్మలో ఆమె సత్యభా-మగా జన్మించింది. శ్రీకృష్ణుని భర్తగా పొందింది. గత జన్మలో కార్తీకదీపాన్ని వెలిగించ-డం, దీపదానాలను చేసిన ఫలితంగా ఈ జన్మలో ఆమె సత్యవతిగా జన్మించి సకల ఐశ్వర్యాలను పొందింది. ఇలా కార్తీకమాసంలో దీపాన్ని వెలి-గించడం, దర్శించడం వల్ల అనేక ఫలితాలు లభిస్తాయని పురాణాలు వెల్లడిస్తున్నాయి.

శాస్త్రీయంగా పరిశీలించిన-ప్పుడు, మన ఆచారాలలో అనేక ఆరోగ్య రహస్యాలు దాగున్నాయి. కార్తీకం వచ్చే సమయానికి పగటి సమయం తక్కువై, రాత్రి సమయం అధి-కమవుతుంది. సాయంత్రం త్వరగా సూర్యాస్తమయమ-వుతుంది. ఫలితంగా త్వరగా చీకటి పడుతుంది. చీకటిని పారద్రోలి వెలుగును అం-దించేందుకు కార్తీకదీపాలు ఉపయోగపడతాయి. అం-తేకాకుండా చలికాలం ప్రా-రంభమవుతుంది ఫలితంగా అనేక వ్యాధులు ప్రభలే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితులలో కార్తీక మాసంలో వెలిగించే దీపాలు శరీరానికి తగిన ఉష్ణాన్ని ప్ర-సాదించి వ్యాధులను దూరం చేసేందుకు దోహదపడతా-యి. అంతేకాకుండా వర్షాకా-లానికి, శీతాకాలానికి సంధి కాలం కావున అప్పటివరకు కురిసిన వర్షాల వలన పచ్చి-కబయళ్ళు పచ్చుబడతాయి. వాటి వలన క్రిమి కీటకాదులు, దోమలు అధికమై వ్యాధులకు కారకమవుతుంటాయి. ఈ సమయంలో దీపాలు వెలి-గించడం వల్ల దీపాలు నుంచి వచ్చే పొగ వల్ల గాలిలో కీట-కాలను నాశనం చేసే గుణం పెంపొందుతుంది.

రండి దీపాలు వెలిగిద్దాం. మనలోని చీకట్లు పార దోలుదాం.

# ఈ విశ్వం యొక్క ఉనికికి కారణం ఏమిటి?



వేమూరి వేంకటేశ్వరరావు

ఈ విశ్వం యొక్క ఉనికికి కారణం ఏమిటి? ఈ విశ్వం ప్రాదుర్భావానికి కారణభూతులు ఎవ్వరు? ఈ విశ్వం పనిచేసే తీరు ఏమిటి? ఈ విశ్వనిర్మాణానికి వాడబడ్డ ఘటకద్రవ్యాలు ఏమిటి? మహావిస్ఫోటనం ఎందుకు జరిగింది? ఈ విస్ఫోటనంతోటే స్థలం, కాలం పుట్టేయని అంటారు కదా. విస్ఫోటనానికి "ముందు" స్థలమే లేకపోతే ఆ పేలిన పదార్థం (బ్రహ్మ పదార్థం?) ఎక్కడ ఉండేది? మహావిస్ఫోటనంలోనే కాలం పుట్టినప్పుడు "విస్ఫోటనానికి ముందు" అనే సమాసానికి అర్థం ఉందా?

మన ప్రశ్నలని భౌతిక శాస్త్రం విధించిన పరిధిలోనే అడుగుదాం. పదార్థం పరమాణు రేణువులతో తయారయింది అన్నారు కదా. కొన్ని పరమాణు రేణువుల అస్తిత్వానికి నిలకడ (అంటే స్థిరత్వం) ఉండి, కొన్నింటికి లేదు. ఎందుకని? మనిషి ఎంత పొడుగున్నాడో, ఎంత బరువున్నాడో కొలిచినంత మాత్రాన ఆ మనిషి తత్త్వం అర్థం అవుతుందా? అలాగే మనం చేసినదల్లా విశ్వంలోని అంశాలని కొన్నింటిని – దూరాలు, వేగాలు, కాలాలు, గరిమలు, ఆవేశాలు, మొదలైన భౌతిక రాశులని - కొలిచేం. అంతే కాని ఈ విశ్వం యొక్క తత్త్వాన్ని అర్థం చేసుకోలేదు. ఈ విశ్వం యొక్క అస్తిత్వానికి కారణం ఏమిటి? ఈ రకం ప్రశ్నలకి ఆధునిక భౌతిక శాస్త్రం ఆమోదకరమైన సమాధానాలు ఇవ్వలేకపోతోంది – ఇప్పటివరకు.

పైన అడిగిన ప్రశ్నలకి వేదాంత తత్త్వపు ధోరణిలో తప్ప శాస్త్రీయ ధోరణిలో సమాధానాలు చెప్పలేమని ఒప్పేసుకుందాం – మాటవరసకి. అంటే ఏమిటన్నమాట? కొన్ని రకాల ప్రశ్నలకి సమాధానాలు ఎక్కడ దొరుకుతాయో మనకే తెలియటం లేదు. మరికొన్ని రకాల ప్రశ్నలకి సమాధానాలు ఇంకా అధునాతనమైన అభిమతాలలో దొరకొచ్చనే ఆశ ఉంది. ప్రస్తుతానికి మొదటి రకం ప్రశ్నలకి సమాధానాలు మరొక కోణం నుండి వెతుకుదాం.

ఈ మొదటి రకం ప్రశ్నలు భారతదేశంలో వర్ధిల్లిన సనాతన ధర్మ కర్తలు ఎప్పుడో వేదకాలంలోనే లేవదీశారు. ఋగ్వేదంలో (10.129) నాసదీయ సూక్తం అనే మంత్రం ఉంది. ఈ మంత్రం లోని భావం భాషకి అతీతం. యోగాభ్యాసం చేసిన మునులు అనుభవించి అవగాహన చేసుకున్న బ్రహ్మ సత్యాన్ని భాష విధించిన శృంఖలాలకి బద్ధులై చెప్పేరు. వారు చెప్పదలుచుకున్న మనోభావాన్ని భాషలో బంధించి చెప్పేసరికి సగం భావం నశించిపోయి ఉంటుంది. మిగిలినదానిని ఇంగ్లీషులోకో, తెలుగులోకో దింపి చెప్పటానికి ప్రయత్నిస్తే మరో వన్నె తరిగిపోతుంది. అయినా సరే నాసదీయ సూక్తంలోని ఏడు మంత్రాలలోని భావాన్ని, నాకు స్ఫురించిన విధంగా వ్యాఖ్యానించి తెలుగులో చెప్పటానికి ప్రయత్నం చేస్తాను.

ఈ సూక్తంలో, మంత్రానికి నాలుగు పాదాల చొప్పున, ఏడు మంత్రాలు ఉన్నాయి. ప్రతి మంత్రం లోను మొదటి పాదంలో చెప్పదలుచుకున్న ముఖ్యాంశం ఉంటుంది, మిగిలిన మూడు పాదాలలో కొంత వివరణ ఉంటుంది. మచ్చుకి రెండు మంత్రాలని ఈ దిగువ చూపుతాను.

## కో అద్ధా వేద క ఇహ ప్ర వోచత్ కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః।
## అర్వాగ్ దేవా అస్య విసర్జనేనాఽథా కో వేద యత ఆబభూవ॥

– (నాసదీయ సూక్తం, ఋగ్వేదం 10-129-06)

ఈ సృష్టి ఎక్కడినుండి వచ్చిందో, ఎలా సృష్టింపబడిందో ఎవరు చెప్పగలరు? దేవతలు కూడా సృష్టి మొదలయ్యాకే వచ్చిన వారు కదా, మరి ఈ సృష్టి ఎలా మొదలయ్యిందో ఆ ఎరుకగల వారెవ్వరు?

## ఇయం విసృష్టిర్యత ఆబభూవ యది వా దధే యది వా న।
## యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్ త్సో అంగ వేద యది వా న వేద॥

– (నాసదీయ సూక్తం, ఋగ్వేదం 10-129-07)

ఈ సృష్టి ఆ కర్త సంకల్పమే, అవునో, కాదో? అత్యున్నత ఆకాశంలో ఉండి అధివీక్షించే దేవదేవునకు తెలుసునా? ఆయనకు కూడా తెలుసునో తెలియదో!

ఈ మంత్రాలని అర్థం చేసుకోటానికి ముందుగా "సత్" అనే మాటకి "అసత్" అనే మాటకి ఉన్న విస్తృతార్థం మనం గ్రహించాలి. "సత్" అంటే సత్యం లేదా అస్తిత్వం. దీనినే ఇంగ్లీషులో "బీయింగ్" (being) అనిన్నీ "ఎగ్జిస్టెన్స్" (existence) అనిన్నీ అనొచ్చు. తెలుగులో "ఉనికి" అని కాని, "ఉండటం" అని కాని చెప్పుకోవచ్చు. సత్ అంటే ఏమిటో చెప్పేను కనుక దీనికి వ్యతిరేకమైన లేక విరుద్ధమైన అర్థంతో "అసత్" అనే మాటని వాడదాం. అసత్ అంటే నాస్తిత్వం. సంస్కృతంలో "న" అంటే లేదు, కాదు అనే అర్థాలు ఉన్నాయి. కనుక మంత్రం మొదట్లోనే "న అసత్, న సత్" అనే ద్వంద్వ విరుద్ధ భావాలతో మొదలు అవుతుంది. అందుకనే దీనిని నాసదీయ సూక్తం అన్నారు. ఈ మంత్రానికి అర్థం ఏమిటో ప్రయత్నించి చూద్దాం.

1. సృష్ట్యాదిలో ఉనికి అనేది లేదు, ఉనికి లేకపోవటం అనేది లేదు ("నసదాసీన్నో సదాసీత్ తదానీం").

2. మృత్యువు లేదు, అమరత్వం లేదు, నామరూపాలు లేవు, రాత్రింబవళ్లు లేవు ("న మృత్యు-రాసీదమృతం న తర్హి న రాత్ర్యా")

3. అంతా చీకటితో ఆవృతమైన చిట్టచీకటి ("తమ ఆసీత్ తమసా గుళమగ్రే")

4. ఆ ఆదిలో కోరిక జనించింది . అది ఉనికికి, ఉనికి లేకపోవటానికి మధ్య ఉన్న తెరని ఛేదించింది ("కామస్తదగ్రే సమవర్తతాధి మనసోరేతః")

5. బీజం అలా నాటటంతో మహా శక్తులు నాలుగు దిశలలో ఉద్భవించేయి ("రేతోధ ఆసన్ మహిమాన ఆసన్ త్స్వధా")

6. ఈ సృష్టి ఎలా జరిగిందో ఎవరు చెప్పగలరు? ("కో అద్ధ వేద క ఇహ ప్రవోచత్। కుత అజాతా కుత ఇయాం విసృష్టిః")

7. ఆ సృష్టికర్తకే తెలియాలి. వాడికి కూడా తెలియదేమో ("యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్ । త్సో

అజ్ఞ వేద యది వా న వేద")
ఇప్పుడు ఈ ఏడు శ్లోకాలలో ఉన్న సారాంశాన్ని మన భాషలో చెప్పటానికి ప్రయత్నిస్తాను.

1. ఆదిలో మనకి అవగతమయే విశ్వం లేదు. (మం 1)

2. అంతరిక్షం లేదు. అంతరిక్షానికి అవతల ఏమీ లేదు. కాని ఏదీ లేదనటానికి వీలు లేదు (అంటే, ఏదో ఉందనే భావం). (మం. 2, మం. 1)

3. ఆ ఉన్నదేదో అనంతమైన సాంద్రత కలిగి ఉంది ("గహనం గభీరం", మం. 1).

4. "ఇది" తప్ప మరింకేమీ లేదు (మం. 2).

5. అవగాహనకి అందని ఆ "ఇది" మన అవగాహనకి అందని విధంగా దాగి ఉంది. (మం. 3)

6. ఆ "ఇది" ఏమైతేనేమి, అది నామరూపాలు లేని శూన్యం (శూన్యం కూడ పూర్తిగా "శూన్యం" కాదని గుళిక శాస్త్రం చెబుతోంది కదా!) (మం. 3)

7. తాపం వల్ల దానికి అస్తిత్వం సిద్ధించింది. (మం. 3)

8. ఇచ్ఛ వల్ల విశ్వం వికసించింది. (వికసించి, వ్యాప్తి చెందింది. ) (మం. 4)

9. దేవగణాలకి కూడ ఈ ప్రాదుర్భావం తరువాతే అస్తిత్వం సిద్ధించింది. (మం. 6)

10. ఈ సృష్టికి కారణభూతమైన కారణం ఉందో లేదో తెలియదు. (మం. 7)

11. ఈ సృష్టికార్యం అనే ప్రహేళికకి పరిష్కారం ఉందో, లేదో! (మం. 6, 7)
ఈ సృష్టి ఆ కర్త సంకల్పమే, అవునో, కాదో? అత్యున్నత ఆకాశంలో ఉండి అధివీక్షించే దేవదేవునకు తెలుసునా? ఆయనకు కూడా తెలుసునో తెలియదో! ఇన్ని విషయాలు చెప్పిన మహర్షి (ప్రజాపతి పరమేష్ఠి), చివరికి మన ప్రశ్నలకి సమాధానం చెప్పనే లేదు!

బ్రహ్మసత్యం (Ultimate Reality) యొక్క స్వభావ స్వరూపాలు భాషతో వర్ణించటం చాల కష్టం. "దాని"ది ద్వంద్వ స్వభావం. ఈ ద్వంద స్వభావాన్ని పరిపరి విధాలుగా వర్ణించటానికి ప్రయత్నించేరు మనవాళ్లు. ఉదాహరణకి ఈ నాసదీయ సూక్తం యొక్క సారాంశమే గీత (2.16) లో ఇలా కనిపిస్తుంది:

**నాసతో విద్యతే భావో, నభావో విద్యతే సతః**
**ఉభయోరపిదృష్టో&ంతః త్వనయోస్తత్త్వదర్శిభిః**

ఆత్మ యొక్క నిజ స్వరూపం పై వివేచన జరుగుతున్న సందర్భంలో చెప్పబడ్డ ఈ మంత్రానికి ఈ విధంగా భాష్యం చెప్పవచ్చు: "లేని వస్తువునకు ఉనికి లేదు. ఉన్న వస్తువు లేకుండా పోదు. ఆత్మ సత్ అనియు, అనాత్మ యగు దేహము అసత్ అనియు తత్త్వవేత్తలు మాత్రమే గ్రహింతురు." సదసద్ వస్తువులకు (అంటే సత్, అసత్ లకు) మధ్య గల తారతమ్యం తత్త్వజ్ఞులు మాత్రమే గుర్తించగలరు అని కృష్ణుడు బోధిస్తున్నాడు. సత్, అసత్; ఆత్మ, అనాత్మ; నిత్యం, అనిత్యం; సత్యం, అసత్యం అనే ద్వంద్వభావాల మధ్య ఉండే అంతరం బహు సూక్ష్మం

అగుటచే అవి జనసామాన్యమునకు పరోక్షముగానే భాసించుచున్నవి తప్ప ప్రత్యక్షముగా కానరాకున్నవి.

నాసదీయ సూక్తం లోని చిట్టచివరి మంత్రం వంటిదే గీతలో మరొక శ్లోకం (2.29) ఉంది. అవలోకించండి:

ఆశ్చర్యవ త్పశ్యతి కశ్చి దేనం |
ఆశ్చర్యవత్ ద్వదది తథైవ చాన్యః
ఆశ్చర్యవ చ్చైవ మన్యః శృణోతి |
శ్రుత్వా స్యేనం వేదన న చైవ కస్చ్త

ఆత్మ, దేహముల (సత్, అసత్) పరస్పర సంబంధమును గూర్చి వింతతో చూతురు, వింతగా పలుకుదురు, ఆశ్చర్యముతో విందురు. దీనిని గూర్చి కన్నను, విన్నను, పలికినను గూడ దీనిని నిజముగా నెరిగినవాడు ఒక్కడును లేడు.

ఈ ప్రయత్నంలోని సారాన్ని పోతనామాత్యుడు తెలుగులోకి ఎంత గంభీరంగా దింపేడో చూడండి:


కలడందురు దీనులయెడ
కలడందురు పరమయోగి గణముల పాలన్
కలడందురన్ని దిశలను
కలడు కలండనెడువాడు కలడో లేడో

ఈ మాటలు గజేంద్రుడి నోటి వెంట వచ్చినా, ఈ భావం మహర్షి మెదడులో మెదలిన స్ఫూర్తి. ఇదే భావంతో నాసదీయసూక్తాన్ని ప్రారంభిస్తాడు మహర్షి: "న అసత్ ఆసీత్ నొ సత్ ఆసీత్ తదామి". దీనిని ఇంగ్లీషులో "At first there was no being nor non-being" అన్నారు.

తమసోమా జ్యోతిర్గమయ

సమాప్తం

# బోధకులకు బోధకుడు
# డా. దహగాంసాంబమూర్తి



తుమ్మూరి రాంమోహనరావు

దహరాకాశగమిష్యమాణ మహితాంతః ప్రజ్ఞచేఽదద్విధిన్

దహగాం నామక పౌరుషాభిదమవిద్యా నాశ పట్టమ్మగా

దహియింపం దొలినాటి కర్మములనాత్మజ్ఞాన బోధమ్ముచే

సహి సేయంగను సాంబమూర్తి సకటాక్షా! సాంబమూర్తీ! నమః

అని హస్తినాపురవాసి, ఆంధ్రోపన్యాసకులు విశిష్ట సాహితీ మూర్తి శ్రీ ఏల్చూరి మురళీధరరావు గారిచే ప్రస్తుతించబడిన డా. దహగాం సాంబమూర్తి గారు విద్యారంగంలో తెలుగు భాషాబోధకులను తీర్చి దిద్దిన అపురూప బోధకులు.


తెలుగు భాష పరంపరగా కొనసాగాలంటే పాఠశాలలో, కళాశాలలో తెలుగుభాషోపాధ్యాయులు విద్యా ర్థులను తీర్చి దిద్దవలసిన అవసరం ఉంది. మరి ఆఉపాధ్యాయులు తెలుగు భాషను సమర్థంగా బడి పిల్లలకు నేర్పించాలంటే సరియైనశిక్షణ అవసరం.

ప్రాథమిక విద్యా బోధనకు, ఉపాధ్యాయ శిక్షణా కేంద్రము-(TTC -Teachers Train-ing Institute), ఉన్నత పాఠశాల విద్యా ర్థులకు బోధించే ఉపాధ్యాయులకు అంటే B.Ed. చేసేవారికై విద్యాకళాశాల (College of education) ఉంటాయి .


ఆ కళాశాలల్లో ఒక్కో విషయానికి ఒక్కో ఉపన్యాసకులుంటారు. అలా విద్యాకళా శాలలోతెలుగు బోధించడమే గాక బోధనకు సంబంధించిన అనేక పుస్తకాలు రచించిన డా. దహగాం సాంబమూర్తి గారు తెలుగు భాషకు సంబంధించిన విద్యాబోధనా శాస్త్రంలోపారీణులు.

నిన్న మొన్ననే ఆశీతిలో అడుగిడిన డా. దహగాం సాంబమూర్తి గారువిద్యా కళాశాలలకు వెలుగులు ప్రసరించిన ఉత్తమ బోధనాచార్యులు. విద్యాబోధనలోమెళుకువలకు సంబంధించిన పలు గ్రంథాలు రచించిన విద్యావేత్త. విద్యాకళాశాలఉపన్యాసకులుగా, ప్రధానా చార్యులుగా, జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసి పదవీవిరమణ పొందిన సాంబ మూర్తి గారు తమ పదవీ కాలంలో విద్యా రంగానికి ఎనలేని సేవచేసిన విద్యారంగ నిపుణులు.

తెలుగు బోధన పద్ధతులు, విద్యా దృక్పథాలు, విద్య-తాత్త్విక దృక్పథాలు,సమాచార ప్రసార సాంకేతిక పరిజ్ఞానం,విద్యా మూల్యాంకనం, విద్యా పరిశోధన పద్ధతులు, పాఠశాల నిర్వహణ విద్యా విషయములు,విద్యా క్షేత్రము-మహనీయుల మహితోక్తులు,-విద్యా తత్త్వవేత్తలు, వయోజన విద్య నిరంతర విద్య , బోధనాభ్యసన ప్రక్రియ-జ్ఞాన నిర్మాణ ఉపగమాలు,(ఉపాధ్యాయుల కరదీపిక), విద్యార్థిమంజూష వంటి విద్యాబోధనకు చెందిన పుస్తకాలే కాకుండా తెలుగు భాషకుసంబంధించిన తెలుగు భాషా సాహిత్య దర్పణం,అక్షర త్రివేణి-,వ్యాస మంజూష, వ్యాకరణమంజూష వంటి గ్రంథాలను కూడా రచించారు.




దహగాం సాంబమూర్తి గారి పరిచయం 1987 లో నేను వరంగల్ కాలేజ్ ఆఫ్ఎడ్యుకేషన్ లో బి.ఎడ్. చేసినప్పుడు ఏర్పడింది. వారు అప్పుడు తెలుగు శాఖాధిపతిగాఉండేవారు. సాధారణంగా బి.ఎడ్. లో ఏవైనా రెండు సబ్జెక్టుల్లో శిక్షణ పొందే అవకాశంఉంటుంది. చాలా మంది ఒక ఆప్షనల్ సబ్జెక్టు , ఒక లాంగ్వేజ్ సబ్జెక్టు తీసుకోవడం పరిపాటి. ఎక్కువ మంది తెలుగుకు ప్రాధాన్యాన్నిస్తారు. కాని నేనురెండూ ఆప్షనల్స్ అంటే గణితము, పదార్థ విజ్ఞానశాస్త్రము తీసుకోవడంతోసాంబమూర్తిగారి వద్ద చదివే అవకాశం నాకు కలుగ లేదు. కానీ నాకున్న తెలుగుభాషాభిమానం వల్ల తరచుగా సారును కలిసే వాణ్ని. అందరిలా కాకుండా నేను నా 35 సంవత్సరాల వయస్సులో బి.ఎడ్ . చేసాను గనుక అప్పటికే నేను రాసిన కవితలు వారికిచూపించడం కోసం వెళ్లే వాణ్ని. ఆ తరువాత చాలఏళ్లకు 2012 లో మళ్లీ వానమామలైవరదాచార్యుల శత జయంతి సభల సందర్భంగా కలుసు కోవడం అప్పటినుండి మైత్రీబంధం కొనసాగుతూ వస్తున్నది. డా. దహగాం సాంబమూర్తి గారు వానమామలైవరదాచార్యుల శతజయంతి సంచికకు సంపాదకులు కావడంతో అనేక సార్లు ఉత్సవకార్యనిర్వాహకుడిగా వారితో సంప్రదింపులుజరిగేవి. పలు సభల్లో కలుసుకోవడం , ఫోన్లోమాట్లాడుకోవటం గత పుష్కర కాలం నడుస్తూ ఉంది.



తన పనేదో తను చేసుకోవడమే తప్ప ఎలాంటి ప్రచార ప్రయత్నాలు చేయని సాంబమూర్తి గారి ప్రతిభా విశేషాలు సన్నిహితులకు , ఆయన శిష్యులకు మాత్రమేతెలుసు. 'కర్మణ్యేవాధికారస్తే' అన్నట్లు ఫలితమాశించకుండా చేపట్టిన పనిని నిర్దుష్టంగా, నిర్దిష్టంగా చేయగల సమర్థులైన కార్యశీలి. ఒక మాటలో చెప్పాలంటే ఆయన విద్యారంగంలో తెలుగు భాషాబోధనారంగంకోసం పుట్టిన కారణజన్ముడు. ఆయన కార్యక్షేత్రవివరా లన్నీ రాస్తే ఓ పుస్తకమే అవుతుంది.


అంతటి కృషిసల్పిన మేధాసంపన్నులు సాంబమూర్తిగారు.

సర్వ సాధారణంగా షష్టిపూర్తి, సప్తతి, అశీతి వంటి ఉత్సవాలు జరుపుకు న్నప్పుడు జరుపుకునే వ్యక్తి గురించిగాని,వారి కృషి గురించిగాని లేదా వారు రాసిన పుస్తకాలమీదసమీక్షల వంటి వాటితోనే సంచికలు వేసుకోవడం . సహజం కాని ప్రముఖ సాహితీ వేత్తగన్నమరాజు శ్రీగిరిజా మనోహరబాబు గారి సంపాదకత్వంలో వచ్చిన సాంబమూర్తి గారిఅశీతి సంచికలో ఒకటి రెండు అభినందనలు తప్ప 97 వ్యాసాలు భారతీయ చింతనకుసంబంధించినవే. ఆ సంచికకు 'భారతీయ చింతన' అని శీర్షిక పెట్టడం సార్థకమైంది. అందులోని వ్యాసాలు అత్యంత విలువైనవి. మన భారతీయ చింతన ను పలుకోణాలలోప్రసిద్ధులైన పండితులు వింగడించి భారతీయ చింతన ఔన్నత్యాన్ని ప్రపంచానికిచాటడానికి రాసిన వ్యాసాలవి.


ఎవరి గురించైనా తెలుసుకోవాలంటే వారి స్నేహితులెవరు అని

చూసి వారి వ్యక్తిత్వాన్నిఅంచనా వేయడం కద్దు. మరి శతాధిక వరిష్ఠ సాహితీ గరిష్ఠులైన దహగాంసాంబమూర్తిగారి శ్రేయోభిలాషులను చూస్తుంటే వారెంతటి గొప్పవారో తెలుస్తుంది.

దహగాం సాంబమూర్తిగారు పాత కరీంనగరంజిల్లా (ప్రస్తుతం జయశంకర్ భూపాల్పల్లి జిల్లా) మహాదేవపూర్ లో వేంకటనర్సమ్మ, వీరయ్య దంపతులకు స్వభాను నామసంవత్సరఆషాఢ బహుళ చతుర్దశి ఆంగ్ల మానం ప్రకారం జూలై 30-1942 న జన్మించారు. రికార్డుల్లో మాత్రం 12-10-1942 అని నమోదు ఉంది. పాఠశాల విద్య, స్వగ్రామంలో, ఆతరువాత చెన్నూరులో జరిగింది. వరంగల్లులో పి.యు.సి చదివారు. తరువాత ప్రైవేటులాడిగ్రీ పాసై ఎం. ఏ. తెలుగు ఉస్మానియ విశ్వ విద్యాలయంలో , ఎం.ఇడి పూనావిశ్వవిద్యాలయం లో చేసారు.రెండింటిలోనూ ప్రథమశ్రేణి లో ఉత్తీర్ణులయ్యారు. ఇవిగాకమైసూరు CIIL నుండి డిప్లొమా ఇన్ కన్నడ(సర్వ ప్రథమ శ్రేణి),గ్రేట్ బ్రిటన్ బ్రైటన్ లోనిససెక్స్ విశ్వవిద్యాలయం నుండి సర్టి ఫికెట్ ఇన్ కరిక్యులం డెవలప్ మెంట్ అండ్ఎడ్యుకేషనల్ ఎసెస్ మెంట్ ను పొందారు. అలాగే దక్షిణ భారత హిందీ ప్రచార సభద్వారా హిందీ విశారద కూడ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.




దాదాపు 20 సంవత్సరాలు ఉపాధ్యా యులుగా వివిధ స్థాయిలలో పనిచేసిన వీరు,వరంగల్ విద్యాకళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా చేరడం జరిగింది. ఇది వీరిజీవితంలో పెద్ద మలుపు. 16 సంవత్స రాల విద్యా కళాశాల వృత్తి వీరి చేత పైన చెప్పినఅనేక పుస్తకాలు రాయించింది. పదోన్నతుల క్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి, విద్యాకళాశాల ప్రధానాచార్యుల పదవులు వీరిని వరించాయి. 2000 సంవత్సరంలో పదవీ విరమణ గావించిన సాంబమూర్తిగారు అనంతరకాలం ఎనిమిదిసంవత్సరాలు ఇతర కళాశాలలో పనిచేయడం వారి




ప్రతిభా పాటవానికి నిదర్శనం.

నీల్ కమల్ బుక్ హౌజ్ వారు వీరి 16 పుస్తకాలను ప్రచురించడమే గాక, మదర్ థెరిస్సా-ఫౌండేషన్ వారితో కలిసి వీరికి ఉత్తమ విద్యావేత్త పురస్కారాన్ని అందించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వాల పాఠ్యగ్రంథాల లో పలుతెలుగు వాచకాలకు వీరు సహరచయితగా ఉండటం విశేషం.

తెలుగు అకాడమీ విద్యా విషయికంగా ప్రచురించిన పది పుస్తకాలకు కూడా వీరు సహ రచయితగా ఉన్నారు.మూర్తి-మాట (శతకము) , వైదిక వివాహ సంస్కార క్రమము వీరిస్వీయ ప్రచురణలు. వరంగల్లులోని అనేక సంస్థల్లో వీరు సభ్యత్వం కలిగి ఉన్నారు.

వానమామలై వరదాచార్యుల శతజయంతి సంచికకు సంపాదకులుగా,ఓరుగల్లు కళావైభవం సంచిక ఉపసంపాదకులుగా ఉండటమే గాక , ఇంకా ఎన్నో సంచికలకుకూడా వీరి సహకారం అందించారు కరీంనగర్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం పొందిన వీరు ,ఎక్కువగాపుస్తకపఠనం ,విద్యా విషయ నిపుణుగా ఉపాధ్యాయ విద్యా క్షేత్రానికి తమవంతుసహకారం అందిస్తూ ఉండడం, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోపాల్గొనడం, సభల్లో ఉపన్యసించడం, రచనలు చేయడం వంటివి ప్రవృత్తిగా చేసుకునితమ అనుభవాలను పదిమందికి పంచుతూ గడుపుతున్నారు.

ప్రస్తుతం వరంగల్ రాగన్న దర్వాజా లో శ్రీమతి ప్రేమలతగారితో నివాసముంటున్నదహగాం సాంబమూర్తిగారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కోడళ్లు , అల్లుళ్లమనుమలు మనుమరాళ్లతో ప్రశాంతజీవనం గడుపుతున్న సాంబ మూర్తిగారి-విద్యావిజ్ఞాన అనుభవాలు పదికాలాల పాటు లభిస్తూ ఉండాలని వారికి పరమేశ్వరుడుఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనసారా కోరుకుంటూ ముగిస్తున్నాను.

# గ్రహాలకే 'గ్రహణం' పడితే



గుండాల మహాలక్ష్మి

గ్రహాలకే గ్రహణం పడితే దైవానుగ్రహం కోరి విగ్రహారాధనలు చేసి భక్తజనాలు కొందరైతే

నిగ్రహం కోల్పోయి ఆగ్రహంతో ఊగిపోయే హేతువాదులు మరికొందరు

జనాలు మతులు తప్పినా!
జగాలు గతులు తప్పునా?

ఆకాశంలో అద్భుతమంటూ ఆనందించేది కొందరైతే!
అపచారమంటూ ఆచారాలతో హడలిపోయేది ఇంకొందరు!

సూర్యచంద్రులకు పట్టిన గ్రహణం గంటలో  నిమిషాలో అయితే...
మనుషులకు పట్టిన పాణిగ్రణహం మాత్రం జీవితకాలం వదలదు

అద్భుతంగా మలచుకుంటే అంతులేని ఆనందమయం
అవగాహన కరువై అపశృతులు దొర్లుతుంటే బ్రతుకంతా అయోమయం

జీవితంలో ఈ  గ్రహపాట్లు పొరపాట్లు భవిష్యత్తుకి సంకేతాలు

గ్రహపాట్లు అకస్మాత్తుగా దాడిచేయు అగచాట్లైతే *పొరపాట్లన్నీ మనం చేసుకున్న  స్వయంకృత అపరాధాలే

చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత  కర్మ ఫలితమే గ్రహపీడనమై వెంటాడుతుంది నిగ్రహం కోల్పోకుండా ఓపికతో గ్రహపీడనం భరిచడమే మనిషివని!

# శ్రీ మాత్రేనమః

పొన్నపల్లి రవిశంకర్

ఏ నామము తలచగానే..
గగనం సైతం పులకిస్తుందో...
ఏ నామం వినగానే మది
భువనేశ్వరీ దేవి.. పరమవుతుందో..
ఆనామమే శ్రీ మాత్రేనమః...

ఏ కీర్తన వింటూనే...
ప్రతి హృదయానికి
ప్రశాంతత  చేకూరుతుందో...
రాగాలన్నీ... మానసరాగాలై
పరవశమవుతాయో...
అదే భువనేశ్వరీదేవి సంకీర్తన...

ఎవరి గళంనుండి
అమృతంలా సంకీర్తన అలవోకగా
నిత్యం జాలువారుతుందో...
ఆబాలగోపాలమూ
ఆనందరాగమాలపిస్తుందో...
వారే భువనేశ్వరీదేవి అనుగ్రహం
పొందిన భక్తులు...

ఆహా..ఎంత భాగ్యము నాది
నిన్ను కీర్తింప జ్ఞాన మొసగితివే...
చిరుకవనమర్పించ..బుద్ధి  నొసగితివే..
నా గళమునకెంతటి సౌభాగ్యమో...
నీ నామము తలచి సన్నుతించ..
నా కరమున కెంత ధన్యతో..
నీ నామము సమర్పింప..

తల్లీ..! ప్రథమానుభూతితోనే నన్ను నేను నీ
పాదాలకు అంకితం చేసుకున్నాను..
అనుమానాలు లేని దానను..
జగద్వైభవమును గాంచి
దివ్యమయ తేజస్సును ఆంతర్యంలో దర్శిం-
చుకుంటూ...
తేజోమయమైన భాస్కరుని నమస్కరిస్తూ...

# విష్ణు అనుసంధానమైన శైవక్షేత్రం దామగుండం



ఆచార్య మత్స్యరాజ హరగోపాల్



శైవ క్షేత్రాలలో ఆరాధ్యదైవం శివుడు. ఇది సర్వ సాధారణమైన విషయం. కాని వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో వెలసిన అతి ప్రాచీనమైన ఆలయం శ్రీరామలింగేశ్వరస్వామివారిది. 'దామగుండ' మనే క్షేత్రంలో ఉంది. ఆలయ ప్రధాన ద్వారం ఎదుట గరుత్మంతుడు వెలిశాడు. ఇదీ ప్రత్యేకత` అందుకనే దీన్ని విష్ణుభగవానుని అనుసంధానమైన శ్రీరామలింగేశ్వర క్షేత్రంగా స్కంధపురాణంలో వర్ణింపబడిరది.

**స్థలపురాణం :**

స్కంధపురాణంలో సనత్కుమారుడు నారదమహర్షికి ఈ స్థల మహాత్మ్యాన్ని వివరించినట్లు చెప్పబడిరది. తదనుసారం దీన్ని 'విభాండక క్షేత్ర'మని కూడా వ్యవహరిస్తారు. రామాయణ కాలంలో విభాండక ఋషి దశరథునిచే పుత్రకామేష్టి యజ్ఞాన్ని జరిపించి, తర్వాత 'దామగుండ' క్షేత్రంలో తపస్సు గావించాడట. ఈయన కుమారుడే ఋష్యశృంగుడు. ఈ క్షేత్రంలోని సరోవరాన్ని 'దామసరోవరం' అని పిలుస్తారు. మరో పౌరాణిక నామం నీలకంఠాశ్రమం ` మార్కండేయ మహర్షితో సహ ఎందరో ఋషులు ఈ క్షేత్రంలో తపస్సు గావించినారని పురాణగాథ. ఇక్కడే 'మార్కండేయ గుహ' ఉన్నది.

పురాతన కాలంలో ఇక్కడ 'ఇసుక'తో కూడిన శివలింగం ఉండేది. దీనినే విభాండక మహర్షి పూజించేవాడట. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన కోటిలింగాల్లో ఇదొకటి. ఆలయ జీర్ణోద్ధరణ కూడా 1665లో కాకతీయ రాజుల కాలంలో జరిగినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. 'దామసరోవరం' ఉత్తరాన బ్రహ్మ సరోవరం, వాణి సరోవరాలు

ఉన్నట్లు పురాణాలు చెబుతున్నాయి.

ఈ క్షేత్రంలో దాముడు `గుండుడు ` అనేవారు వసించినట్లు, వారి వ్యవసాయ పొలాల్లో 'శిలా' రూపంలో లింగం లభించడం, దాన్ని వారు ఈ క్షేత్రంలో ప్రతిష్ఠించడంవల్ల ఈ క్షేత్రాన్ని దామగుండం అని కూడా పిలుస్తారు. ఇది 'స్వయంభూ'లింగం. ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలోని దామగుండం, భైరవ క్షేత్రం, అనంతగిరి, రాకమచర్ల, లొంక ఆంజనేయ /శివక్షేత్రాలను (పరిగి దగ్గర) 'పంచారామ' క్షేత్రాలుగా పిలుస్తారు. దామగుండం క్షేత్ర సమీపంలో 'భైరవ క్షేత్రం' ఉంది. అన్ని వేళలో జలప్రవాహం ఉంటుంది. ఈ క్షేత్రాల్లో శివదర్శనం, పూజలు గావించినవారికి పిశాచారి బాధలు, ఈతిబాధలు తొలుగుతాయని భక్తులు చెబుతారు. చుట్టూ దట్టమైన అడవులు ప్రశాంతమైన స్థలంలో ఈ ప్రాచీన ఆలయాలు వెలిశాయి.

ఈ క్షేత్రంలో శ్రావణమాసంలో సోమవారాలు, శివరాత్రి పర్వదినాలు, ఫాల్గుణ బహుళ దశమి నుండి ఉగాదివరకు ప్రత్యక్ష పూజలు జరుగుతాయి. వేలాది భక్తుల ఈ క్షేత్రాన్ని దర్శిస్తారు.

ఫాల్గుణ మాసంలో బహుళ దశమీ నుండి అయిదురోజులపాటు రథోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంలో ఉత్సవ విగ్రహాలు ఇక్కడ ఉంచుతారు.

పూడూరు మండల కేంద్రంలో సోమేశ్వరాలయమున్నది.

మార్గము : హైదరాబాదు ` మన్నెగూడెం ద్వారా 'పరిగి' వెళ్ళే మార్గంలో 'పూడూరు' మండల కేంద్రమున్నది. ప్రతి అరగంటకు హైదరాబాదు ` పరిగి మార్గంలో బస్సులున్నాయి. 70 కిలోమీటర్లు.పూడూరు నుండి ఆటోలు నడుస్తాయి. లేదా ప్రైవేటు వాహనాల్లో వెళ్ళవచ్చు.

ముగింపు: అత్యంత పురాతనమై, శతాబ్దుల చరిత్ర గల ఈ శైవక్షేత్రం ప్రకృతి రామణీయకత మధ్య, దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. ఈ రామలింగేశ్వరాలయాన్ని ఇటీవలి కాలంలో ఇక్కడ నుంచి తరలించాలన్న ప్రభుత్వ యత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదిన సందర్భంలో ఉత్సవాలు జరుగుతుంటాయని ఆలయంలోని కొలను (గుండం) ఎల్లప్పుడూ నీటిలో కళకళలాడుతుందనీ, ఇక్కడి అయిదు నీటిగుండాలు వేసవిలోనూ, యాత్రికులను అందుబాటులో ఉన్నందువల్ల ఈ పుణ్యక్షేత్రానికి ప్రాముఖ్యత ఏర్పడిరది. అయితే ఇక్కడి అటవీప్రాంతానికి చెందిన మూడువేల ఎకరాల భూముల్లో నావికా దళానికి చెందిన రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంవల్ల ఈ ప్రసిద్ధ ఆలయానికి ముప్పు ఏర్పడనుంది. భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందనటంలో ఎలాంటి సందేహంలేదు.

నేటి వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి, దామగుండం, రాకమచర్ల అటవీ క్షేత్రాలు, ప్రకృతి రామణీయతకు ఆధ్యాత్మిక వాతావరణానికి ప్రతీకలు. అనంతగిరి పద్మనాభస్వామి ఆలయం, దామగుండం శ్రీరామలింగేశ్వర ఆలయం రాకమచర్ల శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను కలుపుతూ 'యాత్రా సర్క్యూట్' Yatra Circute ఏర్పాటు చేస్తే ఈ వెనుకబడిన ప్రాంతంలో యాత్రతోపాటు, ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక ఆనందాన్ని ఈ క్షేత్ర సందర్శనం కల్గిస్తాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించి, టూరిజం అభివృద్ధికి తోడ్పడతారని ఆశిద్దాం.

ఆచార్య మత్స్యరాజ హరగో-


బాలమురళీకృష్ణ వర్ధంతి నవంబరు 22 న


పోరాట పటిమకు స్ఫూర్తి  గ్లెన్ మాక్స్ వెల్

RNI No. TELTEL/2011/39497 NOVEMBER 2023 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication:1st November Date of Posting:8th November




Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001